ప్రతిపక్షం

www.prathipaksham.in

గురువారం 11.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 261 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

టాప్ 2... ఆ ఇద్దరే 10

పల్లె పోరుకు సర్వం సిద్ధం

4,236 పంచాయతీలకు నేడే పోలింగ్

తొలి దశ ఓటర్లు 56,19,430 మంది

- అందరు ఓటు హక్కు వినియోగించుకోవాలి
- అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో పకడ్బందీ ఏర్పాట్లు
- ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరాలతో నిఘా
- ఈ రెండు రోజులు మద్యం షాపులన్నీ బంద్
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వినతి
- ఇప్పటి దాకా రూ. 8 కోట్ల నగదు సీజ్ చేశాం
- లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 10: తెలంగాణలో తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) రాణి కుముదిని సూచించారు. గురువారం హైదరాబాద్‌లో ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, తొలి దశ పల్లె పోరుకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. తొలి దశలో 56,19,430 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో ఈ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల విధులలో లక్ష మందికి పైగా సిబ్బంది పాల్గొనున్నారని వివరించారు. ఈ ఎన్నికలలో ఓటర్లు 18 రకాల ఐడీ కార్డులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏ రకమైన ఐడి కార్డును పోలింగ్ బూత్ అధికారులకు

...:: మిగతా 2లో

పార్టీల మోచేతి నీళ్లు తాగొద్దు

మీరే భావి నేతలుగా ఎదగాలి

ఉన్నతాధికారులుగా రాణించాలి

- ప్రజలకు సుపరిపాలనను అందించాలి-
- అందుకు అన్నిరకాలుగా అండగా ఉంటా
- నాణ్యమైన విద్య కోసం తగిన ఏర్పాట్లు
- ఓయూ అభివృద్ధికి రూ. వెయ్యి కోట్లు విడుదల
- ఓయూ మాస్టర్ ప్లాన్‌కు సూచనలు ఇవ్వండి
- వర్సిటీలో ఖాళీల భర్తీ బాధ్యత వైస్ చాన్స్‌లర్ దే
- యోధులను, మేధావులను అందించిన వర్సిటీ ఇది
- అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఓయూ విద్యార్థులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 10: వర్సిటీ విద్యార్థులు రాజకీయాల ఉచ్చులో పడొద్దని, పార్టీల మోచేతినీళ్లు తాగొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. నాణ్యమైన ఉన్నత విద్యను అభ్యసించి, మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. అందుకు వీలుగా అన్ని సౌకర్యాలు కల్పించే బాధ్యత తనదన్నారు. వారంతా డాక్టర్లు, లాయర్లు, ఐఏఎస్, ఐపీఎస్ లు, శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. యూనివర్సిటీ నుంచి నాయకులై రాష్టాన్ని పరిపాలించాలని కోరారు , విద్యార్థులు ఉన్నత స్థానాలలో ఉండాలని, రాజకీయాలకుకి వచ్చి పేదల కన్నీటిని తూర్చాలని సూచించారు. గుండెల నిండా అభిమానంతో ఓయూకు వచ్చానని అన్నారు. బుధవారం ఆయన ఉస్మానియా యూనివర్సిటీని సందర్శించారు. రూ.వెయ్యి కోట్ల నిధుల జీఓను విద్యార్థులకు అంకితం చేశారు. ఓయూ అభివృద్ధికి రూ.45 లక్షల చెక్కును పూర్వ విద్యార్థులు అందించారు. అనంతరం సభలో మాట్లాడుతూ ఎక్కడేం మాట్లాడాలో అధికారులే

...:: మిగతా 2లో

పదవుల భర్తీపై కాంగ్రెస్ ఫోకస్

- టీపీసీసీ కార్యవర్గంపై అధిష్టానం దృష్టి
- ఢిల్లీకి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నేడు అగ్ర నేతలతో సీఎం కీలక సమావేశాలు
- వర్కింగ్ ప్రెసిడెంట్లు, నామినేటెడ్ పోస్టులపై నిర్ణయం
- త్వరలోనే నియామకాలు ఉంటాయన్న పీసీసీ చీఫ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 10: కాంగ్రెస్ పార్టీలో కీలక పోస్టుల భర్తీపై కసరత్తు జరుగుతోంది. నియామకాల ప్రకటనకు ముహూర్తం ఖరారు అవుతోంది. సీఎం రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. పార్టీ అధినాయకత్వంతో సమావేశం కానున్నారు. ఇదే సమయంలో స్థానిక ఎన్నికలు, రానున్న గ్రేటర్ ఎన్నికల కోసం పార్టీ సమాయత్తం అవుతోంది. అందులో భాగంగా ఈ నియామకాల భర్తీ దిశగా తుది నిర్ణయం తీసుకోనున్నారు. పోస్టుల భర్తీ పైన టీపీసీసీ చీఫ్ కీలక అంశాలను వెల్లడించారు. త్వరలోనే వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. టీపీసీసీ నియామకం జరిగిన రోజే డీసీసీలతో మినహా అన్ని పోస్టులు రద్దు అవుతాయని తెలిపారు. ఈనెల చివరి నాటికి కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పుకొచ్చారు. లంబాడాలకు

...:: మిగతా 2లో

బీసీ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలి

- బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి
- దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన వెంటనే ప్రారంభించాలి
- రాష్ట్రంలో ఎన్నికలపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం
- తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం డిమాండ్
- జంతర్ మంతర్ వద్ద ధర్నా

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: వెంటనే బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలంటూ తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 42% రిజర్వేషన్ల సాధన కోసం జంతర్ మంతర్లో రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాలో పలు తీర్మాణాలు చేశారు. ఈ సందర్భంగా మేకపోతుల నరేందర్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు చట్ట సభల్లో 50% రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన బీసీల 42% రిజర్వేషన్ల రెండు బిల్లులను పార్లమెంటులో ఆమోదించి 9 వ షెడ్యూల్డ్ చేర్చాలని, మహిళ రిజర్వేషన్ల బిల్లులో బీసీ మహిళలకు 50%రిజర్వేషన్లు కేటాయించాలని కోరారు. కేంద్ర కేబినెట్లో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చెయ్యాలని, బీసీ విద్యార్థులకు 10కే ర్యాంక్‌సీఏపీ విధానాన్ని తొలగించి బీసీ విద్యార్థు పూర్తి ఫీజును ప్రభుత్వమే చెల్లించాలని అన్నారు. దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన ను వెంటనే ప్రారంభించాలని కోరారు. ముఖ్యంగా తెలంగాణ జరిగే ఎన్నికలు బీసీలకు నష్ట చేసే విధంగా ఉన్నాయని, మొన్న హైకోర్టు కొట్టివేసినా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మేకపోతుల నరేందర్ గౌడ్ తెలిపారు. జాతీయ బీసీ మేధావుల సంఘం అధ్యక్షుడు ఆళ్ల రామ కృష్ణ మాట్లాడుతూ మన దేశంలో బీసీలంటే పాలకులకు పార్టీలకు అసలు లెక్క లేదని అసహనం వ్యక్తం చేశారు. డాక్టర్ర్యాగా అరుణ్ కుమార్ మాట్లాడుతు దేశం లోఉన్న అత్యధిక జనాభా కలిగిన బీసీలు బాగుపడకుండా దేశం బాగుపడదని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగ మూర్తి పటేల్, ఉపాధ్యక్షులు ఎర్ర శ్రీహరి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గిరగాని భిక్షపతి గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తవతం సత్యనారాయణ, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెంట అజయ్ పటేల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అది మల్లేశం పటేల్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణపై చలి పంజా

- గజగజా వణుకుతున్న రాష్ట్రం
- 16 వరకు రాష్ట్రంలో తీవ్ర చలి
- సాధారణం కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 10: తెలంగాణపై చలి పంజా విసురుతోంది. రాష్ట్రమంతా గజ గజా వణికిపోతోంది. ఈ నెల 16 వరకు రాష్ట్రంలో తీవ్ర చలి వాతావరణం ఉండనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రాత్రి, ఉదయం ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోనున్నాయి. దీని ప్రభావం రాబోయే రోజుల్లో మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ఉదయం వేళల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 6 నుండి 9 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉంది. సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్‌కు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా. ప్రత్యేకించి డిసెంబర్ 10, 11, 12, 13 తేదీల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉత్తర తెలంగాణతో పాటు కొన్ని దక్షిణ తెలంగాణ జిల్లాల్లోనూ చలిగాలుల తీవ్రత అధి కంగా ఉంటుందని

...:: మిగతా 2లో

ప్రజల బాధలు వినని ప్రభుత్వం ఎందుకు

- పేద పిల్లల కన్నీళ్లకు అండగా ఉంటాం
- 'జాగృతి జనంబాటలో' కవిత వెల్లడి
- ఫీజు బకాయిలపై తక్షణ చర్యలు తీసుకోవాలి డిమాండ్

పేద పిల్లల చదువు ఎందుకు ఆపేశారు? ఫీజు రీయింబర్స్ ఎందుకు నిలిపేశారు? ప్రజల బాధలు వినని ప్రభుత్వం ఎందుకు? అని కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. జనంబాటలో విద్యార్థుల వేదన నుంచి బస్తీల దుర్భర జీవనంపై వరకు ప్రతి సమస్యను ప్రభుత్వం ముందుకు గట్టిగా వినిపించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జనం బాట కార్యక్రమం బుధవారం హైదరాబాద్ జిల్లాలో సాగింది.

...:: 2లో



కాంగ్రెస్ హయాంలోనే మూడు సార్లు 'ఓట్‌చోరీ'

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై జరుగుతున్న చర్చలో కాంగ్రెస్ గందరగోళం సృష్టించడాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తప్పుపట్టారు. లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్‌షా మాట్లాడారు.

9

మీ దయ.. మాకేం అక్కర్లేదు

ఉపాధి హామీ పథకం(నరేగా) కొత్త నిబంధనలను తెలియచేస్తూ కేంద్రం పంపిన నోట్‌ను పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ బుధవారం బహిరంగంగా చింపివేశారు. ఇదో పనికిమాలిన కాగితమని ఆమె విమర్శించారు. మీ దయాదాక్షిణ్యాలు మాకు అవసరం లేదన్నారు.

9

సౌదీని కుదిపేసిన వరదలు

సౌదీ అరేబియా అనగానే మక్కా, మదీనా, ఎడారి చిత్రాలే కళ్ల ముందు కదలాడుతాయి. కానీ, ప్రస్తుతం అక్కడ వాతావరణ పరిస్థితులు మారుతున్నాయి. భారీ వర్షా ల కారణంగా వరదలు పోటెత్తుతున్నాయి.

9

2.8 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు

కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో 2.84 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం అసెంబ్లీలో వెల్లడించారు.

9

రాజకీయం

పల్లె పోరుకు సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

చూపించిన ఓటు వేయవచ్చునన్నారు. ఎన్నికలు జరిగే ప్రాంతాలలో వైన్ షాపులన్నీ మూసి వేసినట్లు చెప్పారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు మేజిస్ట్రియల్ పవర్స్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఈసీ వివరించారు.

రూ. 8 కోట్లు సీజ్: లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ

పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఇప్పటి వరకు రూ. 8 కోట్ల నగదు సీజ్ చేశామని లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ వెల్లడించారు. రూ. రెండున్నర కోట్ల విలువైన డ్రగ్స్, రూ. 2 కోట్ల క్యాష్, రూ. 3 కోట్ల విలువైన మద్యం సీజ్ చేశామన్నారు. 3,214 మందిపై ఎఫ్ఐఆర్, 31,428 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వివరించారు. కొంత మంది వద్ద నుంచి ముందస్తు చర్యల్లో భాగంగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. తొలి విడత ఎన్నికల ప్రచారానికి మంగళవారం సాయంత్రంతో తెర పడింది. ఈ తొలి విడత ఎన్నికల్లో మొత్తం 4,236 గ్రామ పంచాయతీలకు నోటిఫికేషన్ వెలువడింది. వాటిలో 5 చోట్ల అసలు నామినేషన్లు దాఖలు కాలేదు. మరో 395 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. వీటి మినహా మిగిలిన 3836 సర్పంచ్ స్థానాలకు రేపు అంటే గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ఈ తొలి విడత పోరులో మొత్తం 13,127 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రూ. 175 కోట్ల నిధులను రేవంత్ ప్రభుత్వం కేటాయించిన సంగతి తెలిసిందే. అందులో రూ. 100 కోట్ల నిధులను ఇప్పటికే సర్కార్ విడుదల చేసింది.

పదవుల భర్తీపై కాంగ్రెస్ ఫోకస్

మొదటిపేజీ తరువాయి

నాలుగు జిల్లాలకు అధ్యక్షులను నియమించామని తెలిపారు. ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ చూడలేక మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఊహించని స్థాయిలో పెట్టుబడులు వచ్చాయని చెప్పుకొచ్చారు. పేరుగాంచిన కంపెనీలతోనే ఒప్పందాలు జరిగాయని వివరించారు. ముందు కొన్ని కార్యక్రమాలు ఫిక్స్ కావడంతో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే ,రాహుల్ గాంధీ గ్లోబల్ సమ్మిట్‌కు రాలేకపోయారని తెలిపారు.

గొప్పగా ఫ్యూచర్ సిటీ

ఫ్యూచర్ సిటీ భవిష్యత్‌లో గొప్పగా ఉంటుందని మహేశ్ గౌడ్ చెప్పారు. లావాదేవీలలో భాగంగానే కవిత బీఆర్ఎస్ నేతల మధ్య విమర్శలు చేసుకుంటున్నారని వివరించారు. కవిత కారణంగా బీఆర్ఎస్ కబ్జాలు అన్ని బయటకు వస్తున్నాయని వ్యాఖ్యానించారు. కవిత ఆరోపణలపై విచారణ చేయాలని సీఎం విజ్ఞప్తి చేస్తన్నట్లు తెలిపారు. తాను పీసీసీగా చాలా సంతృప్తిగా ఉన్నానని స్పష్టం చేసారు. పశ్చిమ బెంగాల్ ఎలక్షన్ కోసం వందేమాతరాన్ని బీజేపీ తెరపైకి తెచ్చిందని విమర్శించారు. మోదీ జీవితంలో అతిపెద్ద పొరపాటు చేశారని ఆగ్రహం వ్యక్తం చేసారు. గత ముఖ్యమంత్రి ఉస్మానియా విశ్వవిద్యాలయం వెళ్లాలంటే భయపడ్డారని మహేష్ గౌడ్ వ్యాఖ్యానించారు. 60 సంవత్సరాల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ట్స్ కాలేజీ మెట్లు ఎక్కడం చరిత్ర అని పేర్కొన్నారు.

హత్యా రాజకీయాలను సహించేది లేదు

- ఓటమి భయంతోనే కాంగ్రెస్ భౌతిక దాడులు
- దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 10: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న హత్యా రాజకీయాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో బీఆర్ఎస్ కార్యకర్త ఉప్పుల మల్లయ్య ప్రాణాలు కోల్పోవడం పట్ల కేటీఆర్ గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కోలేక, భౌతిక దాడులకు దిగడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనం. అధికార మదంతో కాంగ్రెస్ గూండాలు సాగిస్తున్న అరాచకాలను బీఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదు," అని కేటీఆర్ హెచ్చరించారు. గత రాత్రి లింగంపల్లి గ్రామంలో సుమారు 70 మంది కాంగ్రెస్ కార్యకర్తలు కర్రలు, రాళ్లతో బీఆర్ఎస్ నాయకులే లక్ష్యంగా విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారని, ఈ ఘటనలో ఉప్పుల మల్లయ్య మృతి చెందగా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ తో పాటు మరో 15 మంది కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు.

కార్యకర్తలకు కేటీఆర్ భరోసా

ఈ ఘటన తెలిసిన వెంటనే కేటీఆర్.. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్లతో ఫోన్లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. "పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. ఎవరూ అధైర్య పడవద్దు. మరణించిన కార్యకర్త కుటుంబానికి మరియు గాయపడిన వారికి పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుంది," అని కేటీఆర్ భరోసా ఇచ్చారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గ్లోబల్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు మండిపాటు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 10: తెలంగాణ మాజీ మంత్రి హరీశ్ రావు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మండి పడ్డారు. గ్లోబల్ సమ్మిట్ "అట్టర్ ఫ్లాప్ షో" అని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి గ్లాబల్ సమ్మిట్ కోసం సిద్ధం చేసిన విజన్ డాక్యుమెంట్‌లో విజన్ లేదని, దానిని చేరుకునే మిషన్ లేదని, అక్షరాలు, అంకెలు, రంగు పుటలతో అలంకరించిన "విజన్ లెస్ డాక్యుమెంట్" అని ఆయన మండిపడ్డారు. గ్లోబల్ సమ్మిట్ పేరుతో రేవంత్ రెడ్డి నిర్వహించిన కార్యక్రమాలు భూముల అమ్మకాలకు సంబంధించిన రియల్ ఎస్టేట్ ఎక్స్‌పోలాగా మారిపోయాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఫ్యూచర్ సిటీని ప్రదర్శించారని చెబుతున్నప్పటికీ, ఏఐ సమ్మిట్‌లా, అందాల పోటీలా, పొలిటికల్ స్టంట్ మాత్రమే జరిగిందని విమర్శించారు. గ్లోబల్ సమ్మిట్‌లో ప్రధానమంత్రి, 18 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, 5 వేల మంది విదేశీ ప్రతినిధులు రాలేదని అన్నారు. పెట్టుబడులు, ఉద్యోగాల పరంగా రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలు. 2024లో దావోస్ సమావేశాలు, ఏఐ గ్లోబల్ సమ్మిట్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం వంటి అవకాశాల్లో రేవంత్ రెడ్డి ప్రకటించిన కోట్లాది పెట్టుబడులు, లక్షల ఉద్యోగాల వాస్తవ స్థితి ప్రజలకు తెలియదని ఆయన చెప్పారు. రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్ విసరుతూ, ఈ వివరాలను కాగితంలో (వైట్ పేపర్) ఉంచి వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటీ, ఫార్మా సిటీ పేర్లతో ఒకే ప్రాంతంలో పరిశ్రమల కేంద్రీకరణ జరుగుతున్నదని, దీని వల్ల తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో పారిశ్రామిక వికేంద్రీకరణ చేయడం లోపించిందని, ఇప్పటికే ఫార్మా కంపెనీలు హైదరాబాద్‌ను వదలి పక్క రాష్ట్రాలకు తరలివెళ్ళాయని, పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు తగ్గాయని పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్ ఒప్పందాలు ప్రజలకు ఏవీ ఉపయోగపడని విధంగా ఉన్నాయని హరీశ్ రావు అన్నారు. అదానీ, అంబానీ వంటి ప్రతినిధులకు సంబంధించిన ఒప్పందాలు, విరాళాల విషయాలు వివాదాస్పదంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో సాధించిన అభివృద్ధిని నాశనం చేయకుండా, తప్పనిసరిగా ఆ అభివృద్ధిని కొనసాగించాలన్నారు. రెండు సంవత్సరాల పాలనలో చేసిన ప్రదర్శనలు, చిల్లర నిర్ణయాలు తెలంగాణ ప్రజల హితాన్ని పరిగణించకపోవడం, పెట్టుబడులు, ఉద్యోగాలను వాస్తవంగా అందించకపోవడం తీవ్రంగా విమర్శించారు.

పార్టీల మోచేతి నీళ్లు తాగొద్దు

మొదటిపేజీ తరువాయి

పేజీల కొద్దీ పేజీలు రాసిస్తారన్నారు. ఓయూకు వెళ్తా అన్నప్పుడు చాలా ధైర్యం చేస్తున్నారని తనతో కొందరు అన్నారని, అక్కడ ప్రజాప్రతినిధులను అడ్డుకున్న చరిత్ర ఉందని చెప్పారని, తనది ధైర్యం కాదని, అభిమానం అని వారితో చెప్పానని తెలిపారు. ఓయూని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పంతో వచ్చానని పేర్కొన్నారు.

పీవీ, జార్జిరెడ్డి, గద్దర్ వంటి వీరులు

పీవీ నర్సింహారావు, జార్జిరెడ్డి, గద్దర్ వంటి వీరులను ఓయూ అందించిందని సీఎం అన్నారు. ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణలో పోరాటాలు వచ్చాయని, సామాన్యులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య దొరలపై పోరాడారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమం వచ్చిందని, ఉద్యమాన్ని ఉస్మానియా వర్సిటీ నుంచే విద్యార్థులు ప్రారంభించారని తెలిపారు. ఓయూ నుంచి ఎందరో విద్యార్థులు నక్సలిజం వైపు వెళ్లారని అన్నారు. విద్య ఒక్కటే ఆత్మగౌరవాన్ని పెంచుతుందని విద్యార్థులకు సీఎం సూచించారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారని, పదేండ్లలో ఎవరికైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. వంద ఎకరాలలో ఫాంహౌస్‌లు వచ్చాయని, కానీ దళితులకు భూములు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం దగ్గర పంచడానికి భూములు లేవని, ఉన్నది ఉన్నట్టు చెబితే తమను విమర్శిస్తున్నారని సీఎం అన్నారు. చదువు లేకపోవడం వెనుకబాటుతనం అని సీఎం సూచించారు. 'ఇప్పుడు విద్య అందుబాటులో ఉంది కానీ, నాణ్యమైన విద్య కావాలి. అందుకే అందరికీ నాణ్యమైన విద్య అందించాలని ప్రభుత్వం సంకల్పించిందని' అన్నారు. కులం అడ్డుగోడలను తొలగించేందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. యువత నైపుణ్యాన్ని పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకున్నామన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు ప్రణాళికలు వేస్తున్నామన్నారు.

భాష కేవలం కమ్యూనికేషన్

తాను నల్లమల అడవి నుంచి ప్రభుత్వ స్కూలు, కళాశాలలో చదివానని సీఎం గుర్తు చేశారు. తనకు ఇంగ్లీష్ రాదని వాళ్లు అనుకుంటున్నారని, చైనాకు ఇంగ్లీష్ రాదు కానీ, చైనా ప్రొడక్షన్ ఆపేస్తే విలవిలలాడుతుందని తెలిపారు. భాష కేవలం కమ్యూనికేషన్ కోసం మాత్రమే అది నాలెడ్జి కాదని తెలిపారు. యూనివర్సిటీలో పోస్టుల భర్తీ కోసం వర్సిటీకే అధికారం ఇస్తున్నామని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీకి సంబంధించిన ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్, డిజైన్స్ పై విద్యార్థుల అభిప్రాయాలు, సూచనల కోసం ప్రత్యేక క్యూఆర్ కోడ్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. విద్యార్థుల అభిప్రాయాలు, సూచనల ఆధారంగా తుది మాస్టర్ ప్లాన్, డిజైన్లను ఖరారు చేయనున్నట్లు తెలిపారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ సలహాదారులు కె, కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, జి. చిన్నారెడ్డి, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ప్రొఫెసర్ కోదండరామ్, ఉస్మానియా వీసీ కుమార్, ప్రొఫెసర్ కాశీం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ కమిషన్, ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యులు సమావేశానికి హాజరయ్యారు.

తెలంగాణపై చలి పంజా

మొదటిపేజీ తరువాయి

వాతావరణ శాఖ వెల్లడించింది. జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్ధిపేట, సంగారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రజలు చలి నుంచి రక్షణ కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి అవసరం ఉందని తెలిపింది. హైదరాబాద్‌లో పెరగనున్న చలి తీవ్రత హైదరాబాద్ నగరంలోనూ చలి తీవ్రత పెరగనుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు 9నుంచి 12 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతాయని అంచనా. హైదరాబాద్ వాసులు కూడా చలిగాలుల ప్రభావం నుంచి తమను తాము కాపాడుకోవడానికి తగు చర్యలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. ఈ చలి తీవ్రత నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారి పట్ల అదనపు శ్రద్ధ వహించాలని సూచనలు చేశారు. చలి తీవ్రత పెరిగే క్రమంలో ఉదయం వేళల్లో, రాత్రి సమయాల్లో వెచ్చని దుస్తులు ధరించడం, అవసరమైతే తప్ప బయటకు రాకుండా ఉండటం శ్రేయస్కర మని చెబుతున్నారు. పొగమంచు, చలి కారణంగా వాహనదారులు కూడా రహదారులపై జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు హెచ్చరించారు.

విత్తన చట్టం 2025.. రైతాంగం శ్రేయస్సుకు బాటలు వేయాలి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ముసాయిదా చట్టం - 2025 పై అధికారులకు దిశా నిర్దేశం

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్10: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విత్తన ముసాయిదా చట్టం 2025 పై అభ్యంతరాలను డిసెంబర్ 11 లోపు రాష్ట్రాలు తెలపాలని కోరగా, అందుకనుగుణంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సచివాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో సమావేశమై తుది నివేదిక రూపకల్పనలో చేర్చాల్సిన, చట్టంలో మార్చాల్సిన అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు విత్తనోత్పత్తి కీలమని, సాంప్రదాయ, స్వదేశీ రకాలు సహా అధికనాణ్యత గల విత్తనాల సాగు మరియు సంరక్షణలో వేలాది మంది రైతులు భాగస్వాములుగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి వారి సహకారం చాలా ముఖ్యమైనది అయినప్పటికీ, విత్తన రైతులు తరచుగా అధికారిక గుర్తింపు లేకపోవడం, లోపభూయిష్ట ఒప్పంద నిబంధనలు, సరైన పరిహారం అందకపోవడం వంటి ముఖ్యమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారని, గత పదేళ్ల కాలంలో విత్తనోత్పత్తి సమస్యలతో పాటు, ముఖ్యంగా పత్తి, మిరప, మొక్కజొన్న మరియు కూరగాయలు పండించే రైతులు నకిలీ, నాసిరకం, అనుమతి లేని మరియు అధిక ధర కలిగిన విత్తనాల వ్యాప్తి కారణంగా నష్టాలను చవిచూశారని అన్నారు. నాణ్యత లేని హైబ్రిడ్, బీటీ విత్తనాల లభ్యత, విత్తనాలు, ఇన్‌పుట్ ఖర్చులు బాగా పెరగడంతో కలిపి, సాగు ఖర్చు గణనీయంగా పెరిగడంతో పాటు వ్యవసాయ కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను మరింత తీవ్రతరం చేసింది అని అన్నారు. విత్తనచట్టం, 1966 మరియు తదనంతరం ప్రభుత్వం తీసుకొచ్చిన 2004,2010 మరియు 2019 నాటి విత్తన బిల్లు ముసాయిదాలో అనేక నిబంధనలు ఉన్నప్పటికి, రైతుల ప్రయోజనాలను, హక్కులను పరిరక్షించడంలో ప్రభావవంతమైన చట్టాలు లేకపోవడంతో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. మారుతున్న పరిస్థితులు, వ్యవసాయ రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని కఠిన చట్టాలను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ దశలో గత నెలలో కేంద్ర ప్రభుత్వం విత్తన బిల్లు ముసాయిదా 2025 ని తీసుకొచ్చి, దానిలో అభ్యంతరాలు తెలిపి మార్పులు, చేర్పులు చేసేందుకు రాష్ట్రాలకు అవకాశం కల్పించే విధంగా, వెబ్ సైట్ లో ఉంచడం జరిగిందని మంత్రి అన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్రస్థాయి, జిల్లాల స్థాయిలో రైతులతో, రైతు సంఘాల ప్రతినిధులతో, డీలర్లతో, విత్తనోత్పత్తి దారులతో, విత్తన కంపెనీ ప్రతినిధులతో, పూర్తి స్థాయి చర్చలు జరిపి, ఆ చర్చల ద్వారా వారు తెలిపిన అభిప్రాయాలను క్రోడికరించి ఒక నివేదికను తయారుచేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ అంశాలతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదనలు చేసి వీటన్నిటిని మూసాయిదా విత్తన బిల్లులో చేర్చే విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని కొరినట్టు తెలియజేశారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి మరియు ఇతర వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల బాధలు వినని ప్రభుత్వం ఎందుకు

- పేద పిల్లల కన్నీళ్లకు అండగా ఉంటాం
- 'జాగృతి జనంబాటలో' కవిత వెల్లడి
- ఫీజు బకాయిలపై తక్షణ చర్యలు తీసుకోవాలి డిమాండ్

ప్రతిపక్షం, సీటీ బ్యూరో, డిసెంబర్10: పేద పిల్లల చదువు ఎందుకు ఆపేశారు? ఫీజు రీయింబర్స్ ఎందుకు నిలిపేశారు? ప్రజల బాధలు వినని ప్రభుత్వం ఎందుకు? అని కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. జనంబాటలో విద్యార్థుల వేదన నుంచి బస్తీల దుర్భర జీవనంపై వరకు ప్రతి సమస్యను ప్రభుత్వం ముందుకు గట్టిగా వినిపించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జనం బాట కార్యక్రమం బుధవారం హైదరాబాద్ జిల్లాలో సాగింది. జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రజల మధ్య తిరుగుతూ వారి కన్నీళ్లు, బాధలు, వేదనను ఆలకించారు. ఫీజు భర్తీ కోసం ఖమ్మం నుంచి అడుగడుగునా నొప్పిని మోసుకుంటూ వచ్చిన విద్యార్థి నాయకులు దత్త, శ్రీశ్రీలను కవిత బంజారాహిల్స్‌లో ఆత్మీయంగా కలుసుకున్నారు. పేదింటి పిల్లలు చదువు కోసం ఆశలు పెట్టుకుంటే, ప్రభుత్వం మాత్రం వారి బకాయిలను కూడా చెల్లించకుండా చేతులు ఎత్తేసిందని ఆమె తీవ్రంగా విమర్శించారు. ఫీజులు చెల్లించలేదని చెప్పి విద్యాసంస్థలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవంతో ఆ పిల్లల భవిష్యత్తు మార్గం మూసుకుపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "పిల్లల కన్నీళ్లను తుడవడమే ప్రభుత్వ పని. కానీ ఇక్కడ ప్రభుత్వం పిల్లలను చదువు నుంచి దూరం చేస్తోంది" అని కవిత బాధపడ్డారు. వెంటనే ఫీజు భర్తీ విడుదల చేయాలని, ఉద్యోగ ప్రకటనలు ప్రకటించాలని ఆమె స్పష్టం చేశారు. కంటోన్మెంట్ ప్రాంతంలోని బోయిన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లిన కవిత అక్కడి చిన్నారులతో ఆత్మీయంగా మాట్లాడారు. పాఠశాల చుట్టూ గోడ, భద్రతా ఏర్పాట్లు లేవని చూసి ఆమె నిరాశ వ్యక్తం చేశారు. "మన పిల్లల భద్రత కోసం కావలసిన వసతులు జాగృతి ఏర్పాటు చేస్తుంది. ఇది మా బాధ్యత" అని కవిత అండగా నిలిచారు. అక్కడి అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకులు లేకపోవడంతో "ఈ చిన్నారులు ఎవరికి భారమవ్వరు.. వీళ్లు మన భవిష్యత్తు" అని ఆమె అన్నారు.

అసహనంతోనే ఎమ్మెల్యే కృష్ణారావు వ్యాఖ్యలు

ఇక కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలపై కవిత గట్టిగా స్పందిస్తూ, అవి రాజకీయ అసహనానికి, వ్యక్తిగత నిరాశకు నిదర్శనమని అన్నారు. "నాపై ఎన్ని ఆరోపణలు చేసినా, నేను నిజం ముందు తలెత్తి నిలుస్తాను. పత్రాలతో, సాక్ష్యాలతో సమాధానం ఇస్తాను" అని కవిత స్పష్టం చేశారు. "పాలక పక్షం వినడం లేదు.. ప్రతిపక్షం మాట్లాడడం లేదు... జాగృతి మాత్రమే ప్రజల గళం అవుతోంది" అని ఆమె పేర్కొన్నారు. రామన్న చెరువు నిండిపోవడంతో పరిసర ప్రాంతాలు మునుగుతున్న దృశ్యం చూసి కవిత తీవ్రంగా బాధపడ్డారు. కంటోన్మెంట్ ప్రాంతం ప్రత్యేకంగా ఉండడం వల్ల ప్రజలు నరక జీవనం గడుపుతున్నారని, ఈ ప్రాంతాన్ని నగర పాలక సంస్థలో కలపడం తప్ప సమస్యలకు పరిష్కారం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. సనత్‌నగర్ డీకే గూడలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో చెత్త వాహనాలు నిలిపివేయడంతో, ఈ డంపింగ్‌ను ప్రజల మధ్య నుంచి తప్పక తొలగింపజేస్తాం అని ఆమె హామీ ఇచ్చారు. బల్కంపేట ఎల్లమ్మను దర్శించిన తర్వాత యూసుఫ్‌గూడలో మూడు రోజులు పోలీసు స్టేషన్‌లో నిర్బంధించబడిన బాలుడు అజిత్ ఇంటికి వెళ్లిన కవిత.. "ఇది చట్టవిరుద్ధమేకాదు.. మానవతా విరుద్ధం. ఈ బాబు చదువూ.. ఆరోగ్యమూ.. భవిష్యత్తూ ప్రభుత్వం చూసుకోవాలి" అని ఆమె డిమాండ్ చేశారు. డీజీపీ అపాయింట్మెంట్ కోరినప్పటికీ స్పందన లేకపోవడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తర్వాత, ఎర్రగడ్డలోని ప్రేమ్ నగర్ బస్తీలో డబుల్ బెడ్రూం ఇళ్ళు లేని పేద ప్రజలతో సమావేశమై వారి సమస్యలు, సమస్య పరిష్కార మార్గాలపై మాట్లాడారు.

“

పరకామణి చోరీ విషయంలో జగన్ వ్యాఖ్యలను పవన్ వక్రీకరిస్తున్నారు. అసలు పవన్ ఏ ధర్మాన్ని పాటిస్తున్నారు. నేను బాప్టిస్ట్ మతం తీసుకున్నానని ఒకసారి, సర్వమతాలూ సమానమని మరోసారి అన్నాడు. ఇప్పుడు సనాతనమే తన ధర్మం అంటున్నాడు. నీకో ధర్మం లేదు, నీతి లేదు, మతం లేదు, సిద్ధాంతం లేదు. నీకున్న ఒకే ఒక్క సిద్ధాంతం చంద్రబాబు చెప్పింది చేయడం.

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

స్టార్టప్ల కోసం రూ.1000 కోట్ల ఫండ్

- గూగుల్ అంత ఎత్తుకు ఎదగాలి
- టీహబ్లో గూగుల్‌ఫర్‌స్టార్టప్స్‌కేంద్రం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్10 : గూగుల్ అంత ఎత్తుకు ఎదిగేలా స్టార్టప్లు కష్టపడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. స్టార్టప్ల కోసం ప్రభుత్వం రూ.1000 కోట్ల ఫండ్ ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్ స్టార్టప్లపైనే కాదు, యూనికార్న్లపై దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. కనీసం హైదరాబాద్ నుంచి 100 యూనికార్న్ సంస్థలు రావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ లోని టీహబ్‌లో గూగుల్ ఫర్ స్టార్టప్స్ కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కేంద్రం ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, 1998లో గూగుల్ ప్రస్థానం కూడా ఒక స్టార్టప్‌గానే మొదలైందని ముఖ్యమంత్రి తెలిపారు. గూగుల్ విజయ ప్రస్థానం మాకు నిత్యం స్ఫూర్తిదాయకమని అన్నారు. గూగుల్, యాపిల్, అమెజాన్, టెస్లా వంటివి గొప్ప స్టార్టప్‌లని ఆయన కొనియాడారు. 100 స్టార్టప్స్‌లను 1 బిలియన్ జాబితాలో చేర్చేలా కృషి చేస్తామన్నారు. కొత్త ప్రారంభం కొత్త ప్రయాణం : మేం అధికారంలోకి వచ్చి రెండేళ్లయిన సందర్భంగా ఈ కేంద్రం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఇదో కొత్త ప్రారంభమని, ఇదోకొత్త ప్రయాణమని కొనియాడారు. స్టార్టప్స్ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, మా స్టార్టప్‌లకు గూగుల్ మెంటార్‌గా ఉండటం చాలా సంతోషకరమన్నారు. ఇక ఇప్పుడు యూనికార్న్ సంస్థలకు ఏర్పాటు చేసే అవకాశం వచ్చిందని సంతోషించారు. యూనికార్న్‌లను తయారు చేయడం కోసమే ఈ కేంద్రం ఉందన్నారు. 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా పెట్టుకోవడంపై విమర్శలు వచ్చాయని చెప్పారు. ఒక లక్ష్యం అంటూ ఉంటేనే ప్రగతి పథంలో దూసుకెళ్లగలమన్నారు. కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలని సూచించారు. దేశంలోని మొదటి ప్రైవేటు రాకెట్ హైదరాబాద్‌లోనే తయారైందన్న విషయాన్ని గుర్తు చేశారు. టీహబ్‌కు గూగుల్‌ను రప్పించేందుకు చాలా శ్రమించామని, కానీ ఇది దేశంలోనే మొట్టమొదటి గూగుల్ స్టార్టప్స్ కేంద్రమని హర్షించారు. ఇది ప్రపంచంలోనే ఐదో గూగుల్ స్టార్టప్స్ కేంద్రమన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన ఎంపీ అర్వింద్

- పలు సమస్యలపై విన్నపం
- సానుకూలంగా స్పందించిన మంత్రులు

ప్రతిపక్షం, నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ 10: నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి బుధవారం ఢిల్లీ లోని పార్లమెంట్ కార్యాలయంలోకేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, అశ్విని వైష్ణవ్‌ను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు సంబంధించి పలు విజ్ఞప్తులను అందజేశారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని కలిసి నిజామాబాద్ రైల్వే స్టేషన్లో పిక్లైక లిసి నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో పిట్లైన్ల ఏర్పాటు, పార్లమెంట్ పరిధి గుండా పలు రైళ్ల పొడగింపులు, వందే భారత్ సహా పలు నూతన రైళ్ల మంజూరు, అయ్యప్ప స్వాముల కొరకు కొల్లాంకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. అదేవిధంగా కేంద్ర జాతీయ రహదారులు మరియు రవాణా శాఖ మంత్రి గడ్కరీ ని కలిసి జగిత్యాల జిల్లాలో ఎన్‌హెచ్ 61,63 లలో హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణం, అంబారీపేట, అంతర్గాం గ్రామాల వద్ద ఫ్లైఓవర్లు మరియు అండర్ పాసుల నిర్మాణాలు చేపట్టాల్సిందిగా కోరారు. మంజూరుకు తక్షణమే మౌఖికంగా హామీ ఇచ్చి, సాంకేతికంగా సాంకేతికంగా మంజూరుకు తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం కేంద్ర గిరిజన శాఖ సహాయ మంత్రి దుర్గా దాస్ ఉయికే ను సైతం కలిసిన ఎంపీ జగిత్యాల జిల్లాలో బోర్నపల్లి నుండి జగన్నాథపూర్ వరకు హై లెవెల్ బ్రిడ్జిని చేపట్టాలని కోరగా, గిరిజన మంత్రిత్వ శాఖ ద్వారా నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం

- నగరంలో రోడ్డెక్కిన 65 బస్సులు

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 10: హైదరాబాద్‌రాణిగంజ్ బస్ డిపోలో 65 ఎలక్ట్రిక్ బస్సులను రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహాలక్ష్మి పథకం ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ప్రారంభించినట్లు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్, శ్రామిక్, ఇతర సిబ్బంది ఎంతో శ్రమిస్తున్నారని.. వారందరికీ అభినందనలు చెప్పారు. దాంతో దేవాదాయ శాఖ ఆదాయం మహాలక్ష్మి పథకం ద్వారా పెరిగిందన్నారు. రెండేళ్లలో ప్రస్తుతమున్న 40శాతం బస్సులను కొనుగోలు చేయడం జరిగిందని.. ఆర్టీసీలో కొత్త రక్తం వస్తుందన్నారు. కొత్తగా డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్స్ వస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానుల చేసిందన్నారు. ఢిల్లీ లో నివాస యోగ్యం లేకుండా కాలుష్యం ఉన్న పరిస్థితి ఉందని.. ఇక్కడ అలాంటి పరిస్థితి రాకుండా రవాణా శాఖ ఈవీ పాలసీ, స్క్రాప్ పాలసీ తీసుకొచ్చిందన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల భద్రత దృష్టిలో పెట్టుకుందన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక అంశాలు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఈవీ బస్సులు సమ్మక్క సారలమ్మ జాతర, శ్రీశైలం, యాదాద్రికి రాకపోకలు సాగిస్తాయన్నారు. ప్రత్యేక బస్సులు బస్సులు, నూతన బస్ డిపోల ఏర్పాటు, బస్ స్టేషన్లను అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. 1932లో ప్రారంభించిన ఆల్బియన్ బస్సు, మధ్యలో వచ్చిన ఎర్రబస్సు, ప్రస్తుతం నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సు అక్కడ ఎగ్జిబిషన్ పెట్టినట్లు చెప్పారు. ఎర్‌పోర్ట్‌లో ఇబ్బందులు వచ్చినా దగ్గరలో ఉన్న ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిపినట్లు చెప్పారు. ప్రజారవాణాలో మరిన్ని నిర్ణయాలు తీసుకుంటామని.. ఈవీ బస్సుల ప్రారంభోత్సవంతో నగరంలో మరింత మెరుగ్గా బస్సులు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఈవీ పాలసీని తీసుకువచ్చామని.. నగరంలోకాలుష్యాన్ని తగ్గించేందుకు ఈవీ, సీఎన్‌జీ, ఎల్‌పీజీ ఆటోలకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు.

కాంగ్రెస్‌ఆదివాసీ నేషనల్ కోఆర్డినేటర్‌గా శోభన్ బాబు

ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్10 : కాంగ్రెస్ పార్టీ ఆల్ ఇండియా ఆదివాసీ కాంగ్రెస్ నేషనల్ కోఆర్డినేటర్స్‌ను పార్టీ జాతీయ ప్రధాన కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన భూక్య శోభన్‌బాబు ను నేషనల్ కోఆర్డినేటర్‌గా నియమించారు. శోభన్ గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్నారు. ఉన్నత విద్యావంతుడైన శోభన్ బాబు ఇనుగుర్తిలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులకు మద్దతుగా వరంగల్, మహబూబాబాద్, నెల్లూరులో పనిచేశారు. నాగార్జున సాగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్‌ఆదివాసీ శిక్షణ కార్యక్రమంలో సపోర్ట్‌టీం మెంబర్గా పనిచేశారు. ట్రైబల్ హబ్‌ను ఏర్పాటు చేశారు. ట్రైబల్ ఇండియన్‌ఛాంబర్ ఆఫ్‌కామర్స్ అండ్‌ఇండస్ట్రీకి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. తనకు కాంగ్రెస్‌పార్టీ ఆదివాసి నేషనల్ కోఆర్డినేటర్‌గా నియమించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖర్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని శోభన్ బాబు తెలిపారు.

విత్తన చట్టం 2025 ముసాయిదాపై రైతు కమిషన్ నివేదిక



ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్10: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన విత్తన చట్టం 2025 ముసాయిదాలో సవరణలు చేయాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి కోరారు. విత్తన చట్టం ముసాయిదాపై రైతు కమిషన్ ఆధ్వర్యంలో విస్తృతంగా సమీక్ష, సమావేశాలు నిర్వహించామన్నారు. ఈనెల డిసెంబర్ 2న నిర్వహించిన సమావేశంలో వివిధ పార్టీల నేతలు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు, రైతు సంఘాల నేతలు, వ్యవసాయ రంగ నిపుణులు, రిటైర్డ్ అధికారులు పాల్గొన్నారు. ఇక ఈనెల 6న విత్తన కంపెనీల ప్రతినిధులతో కమిషన్ మరోసారి సమావేశం నిర్వహించింది. అంతేకాదు వ్యవసాయ రంగ నిపుణుల నుండి స్వచ్ఛందంగా వచ్చిన సూచనలను సైతం పరిశీలించి, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చట్టంలో చేయాల్సిన సవరణలపై ఓ నివేదికను రూపొందించినట్లు కోదండరెడ్డి తెలిపారు. విత్తన చట్టంలో సవరణలపై తయారుచేసిన నివేదికను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు పంపుతున్నట్లు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. కేంద్రం తెస్తున్న విత్తన చట్టంలో చాలా లొసుగులున్నాయని రైతుల ప్రయోజనం కోసం చట్టం ఉండేలా చూడాలన్నారు. మల్టీనేషనల్ విత్తన కంపెనీలకోసం ప్రత్యేకంగా చట్టాలు రూపొందించాల్సిన అవసరం లేదని వివరించారు.

డీజీపీ కార్యాలయ మినిస్టీరియల్ స్టాఫ్ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డీజీపీ వారికి అభినందనలు తెలుపుతూ, ఉద్యోగుల సంక్షేమం కోసం సమష్టిగా, సమర్థంగా పనిచేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి నిర్వహించిన ఎన్నికల్లో స్టాఫ్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భవిష్యత్ కార్యాచరణలో పారదర్శకత, సేవాభావం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్

13 యేండ్ల బాలికపై సామూహిక అత్యాచారం

- సికింద్రాబాద్‌లో దారుణం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 10 : సికింద్రాబాద్‌లో దారుణం జరిగింది. 13 యేండ్ల బాలికపై నలుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు ఓ లాడ్జిలో బాలికతో ఉన్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులలో ఇద్దరి వయస్సు 19 యేండ్ల చొప్పున, మరో ఇద్దరి వయస్సు 17 యేండ్ల చొప్పున ఉందని తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన బాలిక ఈ నెల నాలుగున కనిపించకుండా పోయింది. దాంతో తమ కూతురు కనిపించడం లేదని బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా బాలిక సికింద్రాబాద్ పరిధిలోని ఒక లాడ్జిలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి నిందితులను అరెస్ట్ చేశారు. బాలిక ఈ నెల ఎనిమిదిన సికింద్రాబాద్ బస్టాండ్ పరిసరాలలో సంచరిస్తుండగా, నిందితులు ఆమెకు మాయమాటలు చెప్పి లాడ్జికి తీసుకెళ్లారు. అక్కడ సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితులపై పోక్సో కేసు నమోదుచేసినట్లు పోలీసుల తెలిపారు.

గ్లోబల్ సమ్మిట్‌ను సందర్శించిన విద్యార్థులు

ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 10 : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ స్టాళ్లు, కార్పొరేట్ కంపెనీల స్టాళ్లను బుధవారం పెద్ద ఎత్తున విద్యార్థినీ, విద్యార్థులు సందర్శించారు. ప్రధానంగా నగరంతోపాటు వివిధ జిల్లాల నుండి ప్రత్యేకంగా వచ్చిన ప్రభుత్వ సంక్షేమ గురుకుల పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులను స్టాళ్లు ఎంతగానో ఆకట్టు కున్నాయి. ప్రధానంగా ఏరోస్పేస్, మూసీ రివర్ డెవలప్మెంట్, హ్యాండీ క్రాఫ్ట్స్, టూరిజం, ఎడ్యుకేషన్, కరీంనగర్ ఇక్కత్, ఫిలిగ్రి, చేర్యాల పెయింటింగ్స్, సైబర్ క్రైమ్ చేదనలో ఉపయోగించే పలు అధునాతన పరికరాలు, డ్రోన్స్ , రోబో తదితర 27 కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. ప్రతీ స్టాళ్లను విద్యార్థులు అత్యంత ఆసక్తిగా తిలకించారు. ఆధునిక పరికరాలు, వైమానిక అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కాగా, భారత్ ఫ్యూచర్ సిటీలో బుధవారం నుండి 13 వరకు నిర్వహిస్తున్న ప్లీనరీ సెషన్లలో నేడు జరిగిన యూత్ ఎంటర్ప్రెన్యూషిప్ అనే అంశంపై జరిగిన రెండు సదస్సులలో దాదాపు మూడు వేల మంది పాల్గొన్నారు.

పుణ్యాలు పెంచుకుంటేనే భవిష్యత్తు

- ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రధర్ బాబు

ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్10: భవిష్యత్ అవసరాలకు తగిన నైపుణ్యాలు పెంచుకోగలిగితేనే యువత తాము కోరుకున్న ఉద్యోగాలను పొందగలుగుతారని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. కాలానుగుణంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమించిన వారే తమ వృత్తులో నిలదొక్కుకోగలుతారని అన్నారు. బుధవారం టీవర్క్స్ ప్రాంగణంలో 'పాత్ వే టు తైవాన్' పేరుతో జరిగిన తైవాన్ లో ఉద్యోగాల కల్పనకు జరిగిన మొదటి రౌండ్ ఇంటర్వ్యూల కార్యక్రమాన్ని శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా టీ వర్క్స్ సిఇఓ జోగిందర్ తనికెళ్ల, తైవాన్ ప్రభుత్వ సంస్థ టేలెంట్ తైవాన్ ప్రతినిధి ఈడెన్ లియెన్ లు మంత్రి సమక్షంలో ఉద్యోగాల కల్పన, ఉన్నత విద్యా కార్యక్రమాలకు సంబంధించిన అవగాహన ఒప్పందం(ఎంఓయు) పై సంతకాలు చేసారు. తైవాన్ కు చెందిన రియల్ టెక్, లాజిటెక్, మీడియాటెక్, విస్ట్రాన్, హిమాక్స్, కౌపాంగ్, ఐటిఆర్ ఐ దీని కోసం ముందుకొచ్చాయి. ఈ ప్రోగ్రాం ద్వారా ఇక్కడి విద్యార్థులను తైవాన్ కంపెనీలు మొదటి రౌండ్ ప్రాథమిక ఎంపిక ప్రక్రియ పూర్తి చేసుకుని తదుపరి దశలో తైవాన్ ను ఆహ్వానిస్తాయి. మొదటి విడతగా 20 ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు తొలిదశ ఇంటర్వ్యూల కోసం హాజరయ్యారు. తైవాన్ కంపెనీలు ప్రతిభావంతుల వేటలో దేశం మొత్తం మీద తెలంగాణను ఎంపిక చేసుకున్నందుకు శ్రీధర్ బాబు ధన్యవాదాలు తెలిపారు. తొలిదశ ఇంటర్వ్యూలు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆరు నెలల పాటు ఇక్కడ (చైనీస్) మాండరిన్ భాషను నేర్చుకోవాల్సి ఉంటుంది. ఆతర్వాత మాండరిన్ భాష, సాంకేతిక పరిజ్ఞానాల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది. ఎంపికైన విద్యార్థులకు తైవాన్ లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని ఆయన తెలిపారు. దీని కోసం 8 తైవాన్ కంపెనీలు ఇక్కడికి వచ్చినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్ చల్లవర్ తమ పరివర్తన ఫండ్ కింద టీవర్క్స్ ఫౌండేషన్ కు రూ.1.5 కోట్ల నిధులను సమకూర్చనున్నట్టు శ్రీధర్ బాబు సమక్షంలో ప్రకటించారు. దీనిని పర్యావరణ అనుకూల విధానాల్లో వస్తూత్పత్తి, ఆవిష్కరణలు చేసే అంకుర సంస్థలకు సహాయనిధిగా అందజేస్తారు. కేవలం 2.2 కోట్ల జనాభా ఉన్న తైవాన్ చిప్ ల తయారీ, టెక్నాలజీ రంగాల్లో ప్రపంచమంతా ఆధారపడే స్థాయికి ఎదిగింది. భవిష్యత్తు టెక్నాలజీల గురించి తైవాన్ ముందు చూపు, శ్రమించే తత్వాన్ని తెలంగాణా యువత ఆదర్శంగా తీసుకోవాలని శ్రీధర్ బాబు సూచించారు. ప్రపంచ అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా అనువర్తనం చెందడం వల్లే తైవాన్ కు ఇదంతా సాధ్యమైందని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో తైవానీస్ యూనివర్సిటీలు తమ విద్యాసంస్థల ప్రాముఖ్యతను వివరించే స్టాళ్లను ఏర్పాటు చేసాయి. 12 వ తరగతి, డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులు తమ యూనివర్సిటీల్లో చేరితే వారికి ఉద్యోగావకాశాలు పెరుగుతాయని యూనివర్సిటీల ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో టీ హబ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లెఫ్టినెంట్ కల్నల్ టి.ఎం. ప్రవీణ్ కుమార్, తైవాన్ ప్రభుత్వ సంస్థ టేలెంట్ తైవాన్ సిఇఓ జోనాథన్ లియావో, ప్రతినిధులు టెర్రా లిన్, ఇడెన్ లియెన్, హైదరాబాద్ ఐఐటీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొ. శివరామకృష్ణ వంజరి తదితరులు పాల్గొన్నారు.

అల్విదా నవాబ్ భాయ్

- పేదల పక్షపాతిని కోల్పోయాం
- నవాబ్ మరణం కాంగ్రెస్ కు తీరని లోటు
- మంత్రి శ్రీధర్ బాబు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి

ప్రతిపక్షం కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 10:- తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఇదారా ఏ ఖాదిమానే మిల్లత్ సెక్రటరీ అబ్దుల్ సమద్ నవాబ్ ను కడసారి చూడటం కోసం కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి, కరీంనగర్ పట్టణం నుంచి పార్టీలకతీతంగా ముస్లింలు, రాజకీయ పార్టీల నాయకులు, లారీ ఓనర్స్ అసోసియేషన్, డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు, ప్రతినిధులు, అభిమానులు, ఇస్లామీయ ధార్మిక పండితులు హాజరయ్యారు. హుస్సేనీ పుర నుంచి బైపాస్ రోడ్ వరకు జన ప్రవహంతో కిక్కిరిసిపోయింది. వేలాది మంది అశ్రునయనాల నడుమ కరీంనగర్ బైపాస్ రోడ్ లో సమద్ నవాబ్ పట్టుదలతో, కృషితో నిర్మించిన మస్జిద్ అఫ్జల్ బియాబాని లో వందలాదిమంది ముస్లింల సమక్షంలో చివరగా నమాజే జనాజా ఆచరించి, ఖబ్రస్తాన్ లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియలలో మంత్రి శ్రీధర్ బాబు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ లతో పాటు పలువురు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలు మాట్లాడుతూ పేద ముస్లింల పక్షపాతిని, ప్రజా బాంధవుడిని సమాజం కోల్పోయిందన్నారు. సమద్ నవాబ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. పార్టీ సమద్ నవాబ్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.



"

ఆధునిక సాగు యంత్రాల కోసం అగ్రికల్చర్ ఎక్విప్మెంట్ బ్యాంకు ఏర్పాటు చేయాలి, శాస్త్రీయ విధానంలో సాగు ప్రణాళిక, ఆధునిక యంత్రాలు, డ్రోన్ల వినియోగంతో ఖర్చు తగ్గించాలి. ఓ వెబ్‌సైట్ ప్రారంభించి పరికరాల వివరాలు తెలియజేయాలి. పత్తి కొనుగోళ్లకు సంబంధించి కపాస్ కిసాన్ యాప్‌లోని సమస్యలను సీసీఐ అధికారులు పరిష్కరించాలి.

- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

ఓపెన్ వాయిస్

హైదరాబాదుకు 'విశ్వ నగర' సొబగులు

హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం 'విజన్2047'తో దూసుకుపోతోంది. మెరుగైన రవాణా, పారిశ్రామిక అభివృద్ధి, వారసత్వ సంపద పరిరక్షణ, పౌర సౌకర్యాలు, పచ్చదనం పెంపు వంటి అంశాలపై దృష్టి సారించారు. మూసీ నదిని సుందరీకరించి 24 గంటల తాగునీటి సరఫరా లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. హైదరాబాద్‌ను ఆవిష్కరణలకు, పెట్టుబడులకు కేంద్రంగా తీర్చిదిద్దడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. దేశంలోనే కాదు, ప్రపంచంలోని పది అగ్రగామి ఆవిష్కరణలకు, పెట్టుబడులకు, అత్యుత్తమ జీవన ప్రమాణాలకు కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్నది విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యం. కోర్ అర్బన్ రీజియన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రణాళికలను ప్రభుత్వం నిర్దేశించింది. ఈ విజన్ ప్రధానంగా మొబిలిటీ, పారిశ్రామిక అభివృద్ధి, వారసత్వ సంపద, పౌర సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణ అనే ఐదు కీలక స్తంభాలపై ఆధారపడి ఉంది. నగర భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌లో సమీకృత రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీ సర్వీసులను అనుసంధానించడం ద్వారా ప్రజలకు మెరుగైన ప్రయాణ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం కామన్ మొబిలిటీ కార్డును అందుబాటులోకి తీసుకురానున్నారు. అంతేకాక, ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ప్రత్యేక మార్గాలలో బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (బీఆర్‌టీఎస్) ను ఏర్పాటు చేయనున్నారు. ప్రజారవాణాను ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించడం ద్వారా శివారు ప్రాంతాల తగిన ప్రజలకు సౌలభ్యం కల్పించనున్నారు. ముఖ్యంగా, రవాణా ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజారవాణా మార్గాల నుంచి కేవలం 15 నిమిషాలలోనే చేరుకునే దూరంలో నిర్మించే ఆఫీసులు వాణిజ్య భవనాలు, నివాసాలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించనుంది. నగరంలో ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించడానికి 1,000 కి.మీ. వాకింగ్, సైక్లింగ్ కారిడార్లు, పాదచారుల కోసం అంతరాయాలు లేని పాదబాటలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, స్కైవాక్‌లను నిర్మించనున్నారు. నగరవ్యాప్తంగా 1500 కి.మీ. మేర 'పీపుల్ ఫస్ట్ కారిడార్ల'ను ఏర్పాటు చేసి, ట్రాఫిక్ రద్దీ లేని, సురక్షితమైన వీధులను డిజైన్ చేయనున్నారు. అదే విధంగా ఓఆర్ఆర్ లోపల ఉన్న పారిశ్రామిక భూములను బహుళ వినియోగానికి అనువుగా వృద్ధి చేయడానికి బ్లౌన్‌ఫీల్డ్ మాస్టర్‌ప్లాన్ రూపొందించనున్నారు. పర్యాటక రంగ అభివృద్ధి లక్ష్యంగా వారసత్వ సంపద సంరక్షణకు చర్యలు తీసుకుంటారు. పాతబస్తీకి యునెస్కో వరల్డ్ హెరిటేజ్ హోదా సాధించడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. 100 పార్కులను, ప్లాజాలను సాంస్కృతిక కేంద్రాలుగా తీర్చిదిద్ది, భారీ ఈవెంట్లకు వేదికలుగా మారుస్తారు. నైట్ ఎకానమీని పెంచడానికి సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్, జలాశయాల వద్ద, ఐటీ కారిడారులలో 24 గంటలు పనిచేసేలా హ్యాకర్స్ సెంటర్స్ 2.0, ఆధునిక మార్కెట్లను ఏర్పాటు చేయనున్నారు. పర్యావరణ స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని బ్లూగ్రీన్ హైదరాబాద్ 2047 పేరుతో ప్రత్యేక ప్రణాళికను అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా మూసీని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతూ మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేపడతారు. పశ్చిమం నుంచి తూర్పు వరకు 3540 కి.మీ. పొడవునా నడక మార్గాలు, వాటర్ ట్యాక్సీ డాక్స్, జెట్టీలు, వంతెనలు, వ్యూయింగ్ డెక్‌లతో సుందరీకరణ చేపట్టనున్నారు. 100 చెరువులను సుందరీకరించడంతో పాటు హుస్సేన్‌సాగర్ 2.0 ద్వారా దానిని మరింత అభివృద్ధి చేస్తారు. జలాశయాల వద్ద సైక్లింగ్, వాకింగ్ లూప్స్, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, రెయిన్ గార్డెన్స్ ఏర్పాటు చేస్తారు. 1500 కి.మీ. అర్బన్ ఫారెస్ట్ బ్లాక్స్, స్ట్రీట్ కనోపీ, నడక మార్గాలు ఏర్పాటు చేయడం ద్వారా నగరంలో పచ్చదనాన్ని పెంచుతారు.

ప్రతిపక్షం
హైదరాబాద్,
గురువారం
11.12.2025

సర్పంచ్ అంటే గ్రామ సేవకుడు

రాష్ట్రంలో ఈ 11, 14, 17 తేదీలలో మూడు విడతలుగా జరుగుతున్న పంచాయతీ ఎన్నికలు మన ముందొక ప్రాథమిక ప్రశ్నను నిలుపుతున్నాయి. మనకు కావలసిన సర్పంచ్ ఎటువంటి వాడు? మాటలతో ఆకట్టుకుని, ఉత్తుత్తి అభివృద్ధి హామీలతో సరిపెట్టే నాయకుడా! లేక ప్రజల నమ్మకాన్ని నిజాయితీతో గెలుచుకుని ఆ గ్రామాన్ని అభివృద్ధి దిశగానే నడిపించే సమర్థుడా? ప్రలోభాలు, ఒత్తిళ్లకు లోబడి వేసే ఓటు ప్రజాస్వామ్యానికి ఉపకరించదు. రేపటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని, స్పష్టమైన ఆలోచనతో మనం తీసుకునే నిర్ణయమే గ్రామ భవిష్యత్తును నిర్దేశిస్తుంది. ఈ విషయం ప్రతి ఓటరు మనస్సులోనూ బలంగా నిలవాల్సిన అవసరం ఉంది.

ఎండీ ఉస్మాన్ ఖాన్
99125 80645

తెలంగాణ రాష్ట్రంలో మూడు విడతలుగా జరుగుతున్న పంచాయతీ ఎన్నికలు గ్రామాలలో రాజకీయ వేడిని రగిలించాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలంటే కేవలం సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలే కాదు. తాగునీరు, పారిశుద్ధ్యం, పాఠశాలలు, ఆరోగ్య సేవలు, రైతు సమస్యలు, మహిళా భద్రత, దళితులు, బలహీన వర్గాల గౌరవం ముఖ్యంగా కోతుల సమస్య. ఇవన్నీ ప్రత్యక్షంగా ప్రభావితమయ్యే రాజకీయ ప్రక్రియ ఇది. రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కంటే పంచాయతీ ఎన్నికలు సామాన్య ప్రజల జీవితాలకు మరింత సమీపంగా ఉంటాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గ్రామ పాలనకు పెద్దపీట వేసినట్టు అధికారికంగా చెప్పుకుంటున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి గ్రామానికి గ్రామానికి భిన్నంగా కనిపిస్తోంది. కొన్నిచోట్ల పంచాయతీలు కాస్తంత అభివృద్ధి కేంద్రాలుగా మారితే, మరికొన్ని చోట్ల రాజకీయ వర్గాల మధ్య పోరాటాలకు వేదికలుగా మారాయి. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఈ ఎన్నికలు ప్రగల్భాలకు కాకుండా, పనితీరుకు పట్టంకట్టే కీలక అవకాశాన్ని ప్రజలకు కల్పిస్తున్నాయి.

హక్కులను అనుగ్రహాలుగా చూపించే ధోరణి

గ్రామీణ రాజకీయాలలో డబ్బు, కులం, బంధుత్వం, పార్టీ ప్రభావం చాలా బలంగా పని చేస్తాయన్నది వాస్తవం. కానీ, అదే సమయంలో గ్రామ సమస్యలు పరిష్కరించగలిగిన నాయకులు, నిజాయితీగా నిధులు వినియోగించిన పంచాయతీలు కూడా ఉంటాయి. అటువంటి ఉదాహరణలు గనక ఉంటే ఈ ఎన్నికలలో అవి మార్గదర్శకంగా నిలవాలి. నిజానికి సర్పంచ్ అనే పదానికి అసలు అర్థం 'సేవకుడు'. గ్రామ ప్రజలపై అధికార దర్పం ప్రదర్శించే పాలకుడు కాదు. ప్రజల అవసరాలు తీర్చే ప్రతినిధి. కానీ, వాస్తవంలో కొన్ని పంచాయతీలలో సర్పంచ్, గుమస్తా, సిబ్బంది ప్రజల పట్ల మెహర్బానీ చేస్తున్నట్టు ప్రవర్తిస్తూ, హక్కులను అనుగ్రహాలుగా చూపించే ధోరణి కనిపిస్తోంది. ఈ దృష్టి కోణం మారకపోతే గ్రామ పాలన ప్రజాస్వామ్యంగా కాక, పెత్తనంగా మారిపోతుంది. దీనికి చెక్ పెట్టాల్సిన బాధ్యత కూడా ప్రజలదే. ముఖ్యంగా యువత, మహిళల పాత్ర పంచాయతీ ఎన్నికలలో కీలకం. చదువుకున్న యువత గ్రామ వ్యవహారాలకు దూరంగా ఉండటం వల్ల గ్రామ రాజకీయాలు కొన్నేళ్లుగా కొన్ని వర్గాల చేతులలోనే చిక్కుకున్నాయి. ఇప్పుడు ఆ పరిస్థితి కొంతవరకు మారింది. గ్రామాభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ పథకాలు కాదు. అవి ఎవరికి ఎలా చేరుతున్నాయన్నదే అసలు ప్రశ్న. మహిళా రిజర్వేషన్ సంఖ్యలకే పరిమితం కాకుండా, నిజమైన నిర్ణయాధికారంగా మారినప్పుడే గ్రామ స్వరాజ్యం అర్థవంతమవుతుంది.

పారదర్శక పాలనకు బాటలు

అయితే, గ్రామ పంచాయతీలలో అధికార విభజన, ఆర్థిక స్వయం సమృద్ధి ఇంకా పూర్తిగా బలపడలేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. పంచాయతీలకు కేటాయించిన నిధులు సమయానికి విడుదల కాకపోవడం, స్థానిక నిర్ణయాల మీద రాజకీయ జోక్యం పెరగడం కరారణంగా కొన్ని పంచాయతీలలో పరిపాలన కుంటుపడుతోందన్న అభి

ప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఎన్నికలలో ప్రజలు ఎంచుకునే ప్రతినిధులు ఈ సమస్యలపై ఎంత బాధ్యతతో నిలబడతారన్నదే కీలకమైన అంశం. ఇంకో ముఖ్య అంశం ఏమిటంటే, ఎన్నికల సమయంలో మాత్రమే కాదు, ఎన్నికల తర్వాత కూడా ప్రజలు పంచాయతీ పాలనను ప్రశ్నించే సామర్థ్యాన్ని పెంచుకోవడం. సర్పంచ్ గెలిచిన తర్వాత ప్రజల మధ్య కనిపించకపోవడం, సమావేశాలు జరపకపోవడం వంటి పరిణామాలు చాలాచోట్ల కనిపిస్తున్నాయి. ఓటు హక్కుతో పాటు ప్రశ్నించే హక్కు కూడా ప్రజాస్వామ్యానికి మౌలిక శక్తి అన్న అవగాహన గ్రామాలలో, ప్రజలలో బలపడాల్సిన అవసరం ఉంది. గ్రామాభివృద్ధి భౌతిక సౌకర్యాలకే పరిమితం కాకుండా సామాజిక న్యాయం, పరస్పర గౌరవం, సహకారం వంటి విలువలపైనా ఆధారపడి ఉంటుంది. దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనారిటీలు, బడుగు బలహీన వర్గాలు పంచాయతీ నిర్ణయాలలో భాగస్వాములు అయ్యే వాతావరణం ఏర్పడినప్పుడే గ్రామాలలో నిజమైన శాంతి, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ ఎన్నికలు అలాంటి పారదర్శక పాలనకు బాటలు వేయగలవా అన్నదే ప్రజల ముందున్న అసలు పరీక్ష.

మన ముందొక ప్రాథమిక ప్రశ్న

రాష్ట్రంలో ఈ 11, 14, 17 తేదీలలో మూడు విడతలుగా జరుగుతున్న పంచాయతీ ఎన్నికలు మన ముందొక ప్రాథమిక ప్రశ్నను నిలుపుతున్నాయి. మనకు కావలసిన సర్పంచ్ ఎటువంటి వాడు? మాటలతో ఆకట్టుకుని, ఉత్తుత్తి అభివృద్ధి హామీలతో సరిపెట్టే నాయకుడా! లేక ప్రజల నమ్మకాన్ని నిజాయితీతో గెలుచుకుని ఆ గ్రామాన్ని అభివృద్ధి దిశగానే నడిపించే సమర్థుడా? ప్రలోభాలు, ఒత్తిళ్లకు లోబడి వేసే ఓటు ప్రజాస్వామ్యానికి ఉపకరించదు. రేపటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని, స్పష్టమైన ఆలోచనతో మనం తీసుకునే నిర్ణయమే గ్రామ భవిష్యత్తును నిర్దేశిస్తుంది. ఈ విషయం ప్రతి ఓటరు మనస్సులోనూ బలంగా నిలవాల్సిన అవసరం ఉంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు, గెలుపు, ఓటములను నిర్ణయించడానికి ఉపకరించే సాధనం కాదు. ప్రజలు తమ గ్రామాన్ని ఎలా చూడాలనుకుంటున్నారో చెప్పే ప్రజాస్వామ్య ప్రతిబింబం. ఆ ప్రతిబింబంలో నిబద్ధత, నిజాయితీ, జవాబుదారీతనం, సామాజిక సమానత్వ బాధ్యత కనిపించినప్పుడే తెలంగాణ గ్రామాలు నిజంగా బలపడతాయి. ఈ ఎన్నికలు ఆ దిశగా ముందుకు అడుగు వేసే అవకాశాన్ని ప్రజల చేతులలో పెడుతున్నాయి. దీన్ని సద్వినియోగం చేసుకున్నప్పుడే గ్రామాలు బాగుపడతాయి, ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

వక్ఫ్ 'ఉమీద్' నమోదు 27 శాతమే

ఉమీద్ పోర్టల్ ఒక రిజిస్ట్రేషన్ ఫారమ్ మాత్రమే కాదు. ఇది పారదర్శకత, జవాబుదారీతనం వైపు వేసిన నిర్ణయాత్మక అడుగు. కేంద్ర ప్రభుత్వం ఇకపై మృదువైన వైఖరిని విడిచిపెట్టి, పోర్టల్ సాంకేతిక లోపాలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి. అదే సమయంలో, ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసిన లేదా ఆస్తుల నమోదు ప్రక్రియను అడ్డుకున్న రాష్ట్ర బోర్డుల అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. వక్ఫ్ ఆస్తుల రక్షణ అనేది మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బాధ్యత మాత్రమే కాదు, రాష్ట్ర ప్రభుత్వాల క్రియాశీల భాగస్వామ్యం కూడా ఇందులో అత్యంత కీలకం.

ముహమ్మద్ ముజాహిద్
9640622076

వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో సమర్థత, పారదర్శకత, అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రారంభించిన 'ఉమీద్' పోర్టల్ తాజా పురోగతి నివేదిక ఆశించిన లక్ష్యానికి, వాస్తవ ఫలితానికి మధ్య ఉన్న లోతైన అంతరాళాన్ని స్పష్టం చేస్తోంది. దేశవ్యాప్తంగా దాదాపు 8.8 లక్షల చారిత్రక వక్ఫ్ ఆస్తుల డిజిటలీకరణ, వాటిని జియో ట్యాగింగ్ చేయడం ద్వారా రక్షణ కల్పించాలనే సదాశయం కేంద్రానికి ఉన్నప్పటికీ, అటు ఆరు నెలల గడువు ముగిసేసరికి 27 శాతం ఆస్తులు మాత్రమే అధికారికంగా నమోదయ్యాయి. ఈ నిష్క్రియత డిజిటల్ పాలన మూలస్తంభాన్ని ప్రశ్నిస్తోంది. కాగా, ఉమీద్ పోర్టల్‌లో 5.17 లక్షల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనా, 2.16 లక్షలు మాత్రమే ఆమోదం పొందాయి. ఈ మొత్తం ఆస్తులలో దాదాపు మూడు వంతుల ఆస్తుల నమోదు నిలిచిపోవడం ప్రభుత్వపర, బోర్డులపర వ్యవస్థాపరమైన వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది. వక్ఫ్ ఆస్తులు అధికంగా ఉన్న ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు అత్యంత మందకొడి పనితీరును కనబరచాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో 80 వేలకు పైగా ఆస్తులు ఉంటే, నమోదు కేవలం 0.89 శాతానికి మాత్రమే పరిమితమైంది. కర్ణాటక (81 శాతం) వంటి రాష్ట్రాలు గడువులోగా సవాలును స్వీకరించి, అత్యధిక నమోదును పూర్తి చేయగల సామర్థ్యం ఉందని నిరూపించాయి. ఈ వ్యత్యాసం రాష్ట్ర బోర్డుల సంకల్పం, సమర్థత, రాజకీయ చిత్తశుద్ధిపైనే ప్రక్రియ ఆధారపడి ఉందని స్పష్టం చేస్తోంది.

తరచూ పోర్టల్ సాంకేతిక లోపాలు

వక్ఫ్ ఆస్తుల సంరక్షకులు (ముతవల్లీలు), బోర్డు అధికారులు తరచూ పోర్టల్ సాంకేతిక లోపాలు, పదేపదే క్రాష్ అవ్వడం, పురాతన ఆస్తులకు సరైన పత్రాలు లేకపోవడం వంటి సమస్యలను ఉదహరించారు. ఈ ఫిర్యాదులు

అసంబద్ధమైనవి కావు. ఒక జాతీయ స్థాయి డిజిటల్ ప్రాజెక్టును ప్రారంభించే ముందు, దాని సాంకేతిక మౌలిక సదుపాయాలు దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారుల భారాన్ని తట్టుకునేలా బలోపేతం చేయాల్సిన కనీస పాలనా ప్రమాణాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందనడానికి ఇది నిదర్శనం. డిజిటల్ సౌకర్యాలు లేని ప్రాంతాలలో పత్రాల సేకరణ ప్రక్రియను సరళీకృతం చేయడంలో కూడా వైఫల్యం స్పష్టంగా కనబడుతోంది. అయితే, ఈ సమస్యలన్నీ వక్ఫ్ ఆస్తుల చట్టవిరుద్ధ ఆక్రమణలను అరికట్టడానికి, వాటిని మైనారిటీ సంక్షేమానికి సమర్థంగా ఉపయోగించడానికి ఉద్దేశించిన కీలక సంస్కరణను అడ్డుకోవడానికి కారణంగా చూపడం సరైంది కాదు. ఆలస్యంగానైనా, గడువును కోల్పోయిన వారికి మూడు నెలల జరిమానా రహిత విండోను కేంద్ర మంత్రి ప్రకటించడం స్వాగతించదగిన పరిణామం. ఇది సమస్యలకు పరిష్కారానికి మార్గం చూపిస్తుంది.

రిజిస్ట్రేషన్ ఫారమ్ మాత్రమే కాదు

ఉమీద్ పోర్టల్ ఒక రిజిస్ట్రేషన్ ఫారమ్ మాత్రమే కాదు. ఇది పారదర్శకత, జవాబుదారీతనం వైపు వేసిన నిర్ణయాత్మక అడుగు. కేంద్ర ప్రభుత్వం ఇకపై మృదువైన వైఖరిని విడిచిపెట్టి, పోర్టల్ సాంకేతిక లోపాలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి. అదే సమయంలో, ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసిన లేదా ఆస్తుల నమోదు ప్రక్రియను అడ్డుకున్న రాష్ట్ర బోర్డుల అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. వక్ఫ్ ఆస్తుల రక్షణ అనేది మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బాధ్యత మాత్రమే కాదు, రాష్ట్ర ప్రభుత్వాల క్రియాశీల భాగస్వామ్యం కూడా ఇందులో అత్యంత కీలకం. ఈ ఆస్తుల పూర్తి డిజిటలీకరణ ద్వారా మాత్రమే పవిత్ర ట్రస్ట్ ఉద్దేశాన్ని నెరవేర్చగలం. లేకపోతే, సదాశయంతో ప్రారంభించిన, ఉమీద్ పోర్టల్ ఒక నిష్క్రియతకు నిదర్శనంగా మిగిలిపోతుంది.

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)

పిల్లల జీవన ప్రమాణాల పెంపులో 'యునిసెఫ్'

రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

అభివృద్ధి చెందుతున్న దేశాలలో పిల్లలు, వారి తల్లుల జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి యునిసెఫ్ ఏర్పాటును చేశారు. ఐక్య రాజ్య సమితి అనుబంధ అంతర్జాతీయ బాలల అత్యవసర నిధి లేదా ఐక్య రాజ్య సమితి అంతర్జాతీయ బాలల అత్యవసర నిధి యునిసెఫ్ 1946 డిసెంబరు 11న సంస్థ ఏర్పాటైంది. ప్రధాన కార్యాలయం న్యూయార్క్ నగరంలో ఉంది. మొదట దీనిని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పిల్లల అత్యవసర నిధి అని పిలిచారు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం 1946 నుండి 1950 వరకు, పిల్లల ఆహారం, దుస్తులు, ఆరోగ్య అవసరాలను, ముఖ్యంగా ఐరోపాలో యునిసెఫ్ పన్నెండు దేశాలలో ఐదు మిలియన్ పిల్లలకు వివిధ రకాల దుస్తులను పంపిణీ చేసింది. క్షయ వ్యాధికి వ్యతిరేకంగా ఎనిమిది మిలియన్ మందికి టీకాలు వేసింది. పాల ప్రాసెసింగ్, పంపిణీ సౌకర్యాలను పునర్నిర్మించింది. ఐరోపాలో మిలియన్ మంది పిల్లలకు రోజు వారీ అనుబంధ భోజనాన్ని అందించింది. 1951-1960 మధ్య కాలంలో, యునిసెఫ్ అత్యవసర అవసరాలను తీర్చడం కొనసాగించింది. అదే సమయంలో దీర్ఘ కాలిక ప్రాయోజిత కార్యక్రమాలకు చేపట్ట నిర్ణయించింది.

పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటానికి

పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటానికి, క్షయ, కుష్టు, మలేరియాకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించింది. పర్యావరణ పారిశుద్ధ్యం కోసం నిబంధనలు రూపొందించింది. తల్లి, పిల్లల ఆరోగ్య సంరక్షణ విద్యను ప్రోత్సహించింది. పిల్లలకు పోషక ప్రమాణాలను పెంచడానికి తక్కువధర, అధిక ప్రోటీన్ కలిగిన ఆహార పదార్థాలను ఉత్పత్తి చేయడానికి, పంపిణీ చేయడానికి సహాయ పడింది. ప్రజలను వారి ఉపయోగంలో అవగాహన కల్పించడానికి ప్రోత్సహించింది. పిల్లల సాంఘిక సంక్షేమం కోసం పిల్లల పెంపకం, గృహ మెరుగుదలపై తల్లులకు అనధికారిక శిక్షణ, డే కేర్, పొరుగు కేంద్రాలు, కుటుంబ సలహా, యువజన క్లబ్‌ల ద్వారా పిల్లలకు సహాయక సేవలను ఏర్పాటు చేసింది. 19611970 కాలంలో యునిసెఫ్ పిల్లలకు దేశ అభివృద్ధికి సహాయం చేసే భావనను పెంపొందించే కార్యక్రమాలకు అనుసరించింది. జాతీయ విధానం, పిల్లలకు సహాయపడే కార్యక్రమాల మధ్య పరస్పర సంబంధాన్ని గుర్తించి, 'దేశం విధానం' అని పిలిచే ఈ విధానం పిల్లల అవసరాలను తీర్చడంలో యునిసెఫ్ ప్రతి దేశంలో తాను ఏర్పాటు చేసిన ప్రాధాన్యతలను తగిన మార్గాలలో అమలు చేయడానికి అనుమతించింది. పర్యవసానంగా, పిల్లల మేధో, మానసిక, వృత్తిపర అవసరాలతో పాటు వారి శారీరక అవసరాలను తీర్చడం, ఉపాధ్యాయ విద్య, పాఠ్యాంశాల సంస్కరణలకు సహాయపడింది. పూర్వ వృత్తి శిక్షణకు నిధులు కేటాయించింది. సాంకేతిక విద్య, సమాచారాన్ని ప్రోత్సహించింది.

గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, ప్రసూతి వార్డులు

గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, ప్రసూతి వార్డులు, ఉపాధ్యాయ శిక్షణా పాఠశాలలు, ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలు, ప్రీ వృత్తి శిక్షణా పాఠశాలలు, ప్రీ వొకేషనల్ బోధకులకు శిక్షణ ఇవ్వడానికి పాఠశాలలు, ఆహార సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి పాఠశాలలు; పోషకాహార కేంద్రాలు, కమ్యూనిటీ గార్డెన్స్, పాఠశాల తోటలు, క్యాంటీన్లు; డే కేర్ సెంటర్, మహిళా క్లబ్‌లు, కమ్యూనిటీ సెంటర్లకు ఇచ్చిన పరికరాలు, దుస్తుల పంపిణీ, అనుబంధ భోజనం, వరదలు, భూకంపాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలకు గురైన లక్షలాది మందికి యునిసెఫ్ అత్యవసర సహాయం అందించింది. పిల్లల కోసం సినిమాలను విడుదల చేసింది. యునిసెఫ్ వార్షిక నివేదిక 2019 చివరి నాటికి, యునిసెఫ్ 2018-2021 వ్యూహాత్మక ప్రణాళిక మిడ్‌టర్మ్ మార్క్, నిర్దేశించిన లక్ష్యాలలో 74 శాతం సాధించింది.

(నేడు యునిసెఫ్ ఆవిర్భావ దినోత్సవం)

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

సీఎం దృష్టికి ఉస్మానియా యూనివర్సిటీ బస్తీల సమస్యలు

- డిప్యూటి మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి
- తార్నాక అభివృద్ధికి రూ.25 కోట్ల బడ్జెట్ మంజూరు చేయాలని విజ్ఞప్తి

ప్రతిపక్షం, హైదరాబాద్, డిసెంబర్ 10: ఉస్మానియా యూనివర్సిటీ సందర్శించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియూసీ రాష్ట్ర అధ్యక్షులు శోభన్ రెడ్డితో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రివర్యులను యూనివర్సిటీలో ఘనంగా స్వాగతించి వేదికపైకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి తార్నాక డివిజన్ ప్రజల తరఫున పలు కీలక సమస్యలపై ముఖ్యమంత్రి సమగ్రంగా వివరించి, వాటి పరిష్కారానికి సంబంధించి విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో గత 70 సంవత్సరాలుగా సుమారు తొమ్మిది బస్తీల్లో వేలాది కుటుంబాలు నివసిస్తూ వస్తున్నాయని తెలిపారు. సుమారు 90 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ బస్తీలు, మౌలిక సదుపాయాల లేమి, గత ప్రభుత్వాల నిర్లక్ష్యం, యూనివర్సిటీ యాజమాన్యం అవసరమైన సౌకర్యాలను నిలిపివేయడం వంటి కారణాల వల్ల తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో, ఆయా బస్తీల ప్రజలకు శాశ్వత పునరావాసం కల్పించేదిశగా ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోనే 20 ఎకరాల భూమిని కేటాయించి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రివర్యులను వినయపూర్వకంగా కోరారు. ఈ ప్రతిపాదన అమలుతో యూనివర్సిటీ యాజమాన్యానికి సుమారు 70 ఎకరాల భూమి స్వేచ్ఛగా లభిస్తుందని, ఇది పరస్పర ప్రయోజనకరమని తెలిపారు. అదేవిధంగా, గత ఎంపీ ఎన్నికల సందర్భంగా మణికేశ్వర్ నగర్‌లో 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఆ హామీ మేరకు ఆస్పత్రి నిర్మాణ ప్రతిపాదనను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. తార్నాక డివిజన్ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు, పార్కులు తదితర మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.25 కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి, ఈ అంశాలపై వెంటనే వైస్ ఛాన్సలర్‌తో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పోలింగ్ ముందు 44 గంటల సైలెన్స్ పీరియడ్

- ప్రచార కార్యక్రమాలపై నిషేధం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 10: గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ దృష్ట్యా, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమావళి మేరకు సంబంధిత మండలాల్లో 'సైలెన్స్ పీరియడ్' అమల్లోకి వస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు.

మొదటి విడత :
గుమ్మడిదల, హత్నూర, కంది, కొండాపూర్, పటాన్చెరు, సదాశివపేట, సంగారెడ్డి మండలాల్లో డిసెంబర్ 09వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుండి ప్రచార కార్యకలాపాలపై నిషేధం అమల్లో ఉందని తెలిపారు.

రెండవ విడత :
ఆందోల్, చౌటకూర్, ఝరాసంగం, కోహిర్, మొగుడంపల్లి, మునిపల్లి, పుల్కల్, రాయికోడ్, వట్పల్లి, జహీరాబాద్ మండలాల్లో డిసెంబర్ 12వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.

మూడవ విడత :
కల్హేర్, కంగ్టి, మనూర్, నాగల్ గిద్ద, నారాయణఖేడ్, నిజాంపేట్, సిర్గాపూర్, న్యాల్కల్ మండలాల్లో డిసెంబర్ 15వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలు నిషేధాజ్ఞలు ఉంటాయని తెలిపారు.
ఆయా విడతలకు సంబంధించి 44 గంటల సైలెన్స్ పీరియడ్ అమలులో ఉంటుందని, ఈ సమయంలో ఎలాంటి బహిరంగ సమావేశాలు, ఎలక్ట్రానిక్ లేదా ఇతర మీడియా మాధ్యమాల ద్వారా ఎన్నికల ప్రచారం పూర్తిగా నిషేధించబడుతుందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, శాంతియుతంగా సాగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని ఆమె కోరారు.

విద్యతోనే సమాజంలో తగిన గుర్తింపు

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, డిసెంబర్ 10 : విద్యతోనే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. బుధవారం జగద్గిరిగుట్ట ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ సుమారు 160 మందికి అల్ ఇన్ వన్ పుస్తకాలను పంపిణి చెశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య ఏ ఒక్కరి సొత్తు కాదని, వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులే నేడు అనేక ఉన్నత పదవులో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, కలెక్టర్లు, ఐపీఎస్ అధికారులు ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలో చదివిన వాళ్లేనాని అన్నారు. అంత ఎదుగుదల ప్రభుత్వ పాఠశాలలో ఉందని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అని చెప్పుకున్నారని తెలిపారు. మన ప్రాంతంలో చదివే పిల్లలు అధికారులుగా ఎదిగి ఈ ప్రాంతానికి, ప్రజలకు సహాయం చేసి ఒక మంచి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి హరినాథ్, జర్నలిస్ట్ నాయకులు తొండ వెంకట్, బాబు, వంశీ, ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్రబోస్, ఉపాధ్యాయులు సుధాకర్, రత్నం పాల్గొన్నారు.

ప్రజలకు సేవచేసే అవకాశం ఇవ్వండి

- తోల్కట్ట సర్పంచ్ అభ్యర్థి మమత శ్రీనివాస్

ప్రతిపక్షం,మొయినాబాద్, డిసెంబర్ 10 : తోల్కట్ట గ్రామ సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థి మమత శ్రీనివాస్ ప్రజల నుండి ప్రేమాభిమానాలు, ఆశీర్వాదాలు అందించాలని కోరారు. తోల్కట్ట గ్రామంలో బుధవారం ఆమె మద్దతుదారులతో కలిసి ఇంటింటా తిరుగుతూ బాల్ గుర్తుకు ఓటువేసి ఆశీర్వదించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...తోల్కట్ట గ్రామాభివృద్ధి కోసం అన్ని విధాలుగా కృషిచేస్తానని, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి తనవంతు నిస్వార్ధ సేవలు అందిస్తానన్నారు. ఈసారి అవకాశం కల్పించి నన్ను గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో ప్రజలను కోరారు. మీ అమూల్యమైన ఓటును బాల్ గుర్తుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి చేసి చూపుతా

- నాగిరెడ్డిగూడ గ్రామ సర్పంచ్ అభ్యర్థి సంధ్య మనోజ్ కుమార్

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 10 : మండలంలోని నాగిరెడ్డి గూడ గ్రామంలో ఎన్నికల వాతావరణం క్షణక్షణం మారుతుంది. గెలుపు దిశగా సంధ్య మనోజ్ కుమార్ ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని నాగిరెడ్డి గూడ ప్రజలను కోరారు. ఎవరిని చూసినా మనోజ్ కుమార్ పేరు , ప్రతి ఇంట్లో అదే చర్చ, ఈసారి మార్పు వస్తుంది. గ్రామ సర్పంచ్ సంధ్య మనోజ్ కుమార్, వస్తారు. గ్రామంలో ఏ సమస్య వచ్చిన ముందుండి పరిష్కరించడానికి ప్రయత్నించే మనోజ్ కుమార్, పేదల బాధ దగ్గరగా ఉంటూ, అవసరమైనప్పుడు సహాయం అందిస్తూ ప్రజలలో బలమైన ఆధరణ సంపాదించుకున్నారు. ఆయన స్వభావంలో ఉన్న ఆత్మీయత, అందుబాటుతనం ప్రజలను మరింత దగ్గర చేసింది. అవసరమైనప్పుడు మనకు తోడు నిలిచేది మనోజ్ కుమార్ ఒక్కరే అనే భావన ఎన్నో కుటుంబాలలో బలంగా నెలకొంది. ప్రతి వీధిలో యువత మనోజ్ కుమార్ కొరకు ప్రచార బృందాలుగా మారింది . గ్రామ పెద్దలు మహిళలు, యువత అందరూ స్వచ్ఛందంగా ముందుకు రావడంతో ప్రచారంలో కొత్త ఊపు వచ్చింది. గ్రామంలోని దేవాలయాలు, ఉత్సవాలు, సంప్రదాయాలలో సంవత్సరాలుగా సేవలు అందించిన మనోజ్ కుమార్ మనవాడే, మన కోసం పనిచేసేవాడే అనే అభిప్రాయం నాగిరెడ్డి గూడ గ్రామం నలుమూలల వ్యాపించింది. గ్రామ సమస్యలను పదవి ఉన్న లేకున్నా పరిష్కరించడంలో ముందు ఉండి సమస్యలను పరిష్కారం చేస్తుండే మనోజ్ కుమార్, ఈసారి గ్రామ ప్రజలు ఆశీర్వదించి ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని నాగిరెడ్డి గూడ ఓటర్లను కోరారు.

పారిశ్రామిక వాడలో ఘోర రోడ్డు ప్రమాదం

- రోడ్డు ప్రమాదానికి గురైన కిర్బీ కార్మికుల బస్సు
- 32 మంది కార్మికులకు స్వల్ప గాయాలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 10 : కిర్బీ పరిశ్రమ కార్మికులను తీసుకువెళ్తున్న బస్సు రోడ్డు ప్రమాదానికి గురైంది. బాధిత, తోటి కార్మికులు తెలిపిన వివరాల మేరకు ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గల పాశం మైలారం పారిశ్రామిక వాడ లోగల కిర్బీ పరిశ్రమకు చెందిన కార్మికులను బుధవారం ఉదయం మండలంలోని ఇంద్రేశం మున్సిపాలిటీలో గల పిఎన్ఆర్ కాలనీ నుంచి మొదటి షిఫ్ట్ కు తీసుకు వెళ్తున్న బస్సు బుధవారం ఉదయం ఐదున్నర గంటల సమయంలో కర్దనూర్ ఔటర్ రింగ్ రోడ్డు నుండి పాశమైలారం వెళ్లే రోడ్డు మార్గంలో పొగ మంచు కమ్మి వేయడంతో ముందు వెళ్తున్న ట్రాలీ లారీని బస్సు ఢీ కొనడంతో బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయింది. అందులో ఉన్న 32 మంది కార్మికులు గాయపడ్డారు. వెంటనే పటాన్ చెరు పట్టణంలోని ఆమేదా హాస్పిటల్ కు తరలించారు. విషయం తెలుసుకున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కారాములు హుటా హుటిన హాస్పిటల్ కి వెళ్లి చికిత్స పొందుతున్న కార్మికులను పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందని వివరాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కార్మికుడి దగ్గరికు వెళ్లి పరామర్శించారు. డాక్టర్లతో పరిశ్రమ యాజమాన్యం ప్రతినిధులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇక్కడ అవసరమైన వైద్య సదుపాయాలు లేకపోతే ఇతర హాస్పిటల్ కు తీసుకుపోయి మెరుగైన వైద్యం అందించాలన్నారు. కార్మికులు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ అధైర్యపడవద్దని సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. ప్రమాదం చాలా బాధాకరమని గాయపడిన కార్మికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదం జరిగిందని తెలవగానే సిఐటియు యూనియన్ ప్రధాన కార్యదర్శి విఎస్ రాజు, తలారి శ్రీనివాస్, నాగప్రసాద్ ఆఫీస్ బేరర్స్ కార్మికులను అంబులెన్స్ లో హాస్పిటల్స్ కు తీసుకవచ్చే ఏర్పాట్లు చేసి పూర్తిస్థాయిలో వైద్యం అందే విధంగా పర్యవేక్షణ చేశారు. ఐదు మందిని కార్మికులను ఐసియు లో అబ్జర్వేషన్ లో ఉంచగా, మిగతా కార్మికులకు వైద్యం అందించి ఎటువంటి ఇబ్బంది లేదని డాక్టర్లు డిశ్చార్జ్ చేశారు.చుక్క రాములు తో పాటు యాజమాన్యం ప్రతినిధులు ఫిల్బోస్, రాజమహేందర్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అతిమేల మానిక్, సిఐటియు జిల్లా కోశాధికారి కే.రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు, పి. పాండురంగారెడ్డి, సిఐటియు సీనియర్ నాయకులు వాజిద్ అలీ, యూనియన్ ప్రధాన కార్యదర్శి విఎస్ రాజు ఆఫీస్ బేరర్స్ హెచ్ఆర్ రాహుల్ నాగరాజు తదితరులు ఉన్నారు.

పుడమి ఫౌండేషన్... మానవ హక్కుల దినోత్సవం

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయపేట్, డిసెంబర్ 10: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పుడమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానవ హక్కులు మన భవిష్యత్తు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ అవగాహన సదస్సుకు పుడమి ఫౌండేషన్ అధ్యక్షులు వెంకటపతి రాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ పుడమి ఫౌండేషన్ రాజ్యాంగపు హక్కులను ప్రచారం చేయడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని ప్రజలు రాజ్యాంగ విలువల పట్ల కట్టుబడి ఉండాలని రాజ్యాంగ అమలు కోసం హక్కులను హరించి వేసినప్పుడు ప్రజలు ప్రశ్నిస్తూ ముందుకు వచ్చినప్పుడే రాజ్యాంగపు హక్కులను కాపాడుకుంటామని అన్నారు. ప్రధాన వక్తవగా పాల్గొన్న మక్తల్ డిప్యూటీ తహసిల్దార్ పుష్పాలత మాట్లాడుతూ మన రాజ్యాంగంలో అత్యున్నతమైన మానవ హక్కులను కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు. హక్కుల ఉల్లంఘన జరుగుతే తప్పని సరిగా మాట్లాడాలని లేదా అత్యున్నత న్యాయస్థానాలను ఆశ్రయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ పుష్పాలత, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్, సమాచార హక్కు చట్టం నాయకులు నారాయణ, మానవ హక్కుల కార్యకర్త మద్దిలేటి, పుడమి ఫౌండేషన్ సభ్యులు శేఖర్, రవికుమార్, అంజి, అశోక్ మరియు కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఐదేళ్లు ప్రజా సేవకుడిలా పనిచేస్తా

- కాశీంభౌళి గ్రామ సర్పంచ్ అభ్యర్థి మాడి రాజేందర్ రెడ్డి

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 10 : బ్యాట్ గుర్తుకు ఓటువేసి సర్పంచ్ గా ఆశీర్వదిస్తే ఐదేళ్లు ప్రజా సేవకుడిలా పనిచేస్తానని కాశీంబౌళి సర్పంచ్ అభ్యర్థి మాడి రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ బ్యాట్ గుర్తుకు ఓటువేసి సర్పంచ్ గా గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనను ఆదరించి గెలిపిస్తే గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికోసం బ్యాట్ గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.కాశీంబౌళి గ్రామంను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు హామీ ఇస్తూ .. ప్రచారంలో ముందుకు సాగుతున్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, డిసెంబర్ 10 : నర్వ మండల పరిధిలోని రాయి కోడ్ గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కందుకూరి వెంకటయ్య (48) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. రోజు మాదిరిగా పొలం పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత సాయంత్రం సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో ఆయన ఇంటివద్ద కుప్పకూలి పోయాడు. హుటాహుటిన నర్వ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం తీసుకెళ్లాలని ఆసుపత్రి సిబ్బంది సూచించడం తో మక్తల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మక్తల్ ఎమ్మెల్యే బందువు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు రాయికోడ్ వాసి పుల్లరి ఆనంద్ బుధవారం వెంకటయ్య నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పి అంత్యక్రియల నిమిత్తం 5 వేల రూపాయలు అందజేశారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుల్లు, ఒక్క కుమారుడు ఉన్నారు. అనంతరం సీనియర్ నాయకులు ఆనంద్ మాట్లాడుతూ వెంకటయ్య మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

బీరంగూడలో పరువు హత్య

- పదవ తరగతి నుండే ప్రేమలో పడ్డ యువ జంట
- అమ్మాయి తల్లి దండ్రులు వారించినా వినక పోవడంతో హత్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 10 : సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మున్సిపాలిటీ బీరంగూడలో యువ ఇంజనీరింగ్ విద్యార్థి జ్యోతి శ్రావణ్ సాయి (20) హత్య అమీన్ పూర్ లో సంచలనం సృష్టించింది కూతురుతో ప్రేమలో ఉన్నాడనే కారణంతో యువకుడిని ఇంటికి పిలిపించి దాడి చేసి హతమార్చిన సంఘటనపై పోలీసులు కీలక వివరాలు వెల్లడించారు.అమీన్‌పూర్ సిఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం బీరంగూడ ఇసుకబావికి చెందిన యువతి (19) తో శ్రావణ్ సాయి గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్నాడు.ఈ సంబంధాన్ని అంగీకరించని అమ్మాయి కుటుంబ సభ్యులు పలుమార్లు వారిని హెచ్చరించినట్టుగా విచారణలో బయటపడింది.ఈ క్రమంలో, పెళ్లి విషయంపై మాట్లాడుకుందామని చెప్పి శ్రావణ్ సాయిని ఇంటికి పిలిపించుకున్న యువతి కుటుంబ సభ్యులు, అతను ఇంట్లోకి అడుగుపెట్టగానే ఒక్కసారిగా దాడికి దిగారని పోలీసులు తెలిపారు. తలకు, శరీరానికి తీవ్ర గాయాలు తగలడంతో శ్రావణ్ అక్కడికక్కడే మృతిచెందినట్టు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. మృతుడు మైసమ్మగూడలోని సెంట్ పీటర్స్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో బీటెక్ సి.ఎస్.ఈ రెండో సంవత్సరం చదువుతున్నట్టు,చదువు నిమిత్తం కుత్బుల్లాపూర్‌లో రూం తీసుకుని నివాసం ఉన్నట్టు పోలీసులు తెలిపారు.ఘటన సమాచారం అందుకున్న వెంటనే అమీన్‌పూర్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని, కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అమ్మాయి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు పోలీసులు ప్రకటించారు. ప్రేమ వ్యవహారమే ఈ సంఘటనకు ప్రాథమిక కారణమని, అనుమానంతో అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

కూటమి ప్రభుత్వ చర్యలతోనే తిరుమల తిరుపతి దేవస్థానంలో జరుగుతున్న అక్రమాలన్నీ బయటపడుతున్నాయి. హిందూ మతం అంటే అందరికీ చిన్న విషయంగా కనిపిస్తోంది. పరకామణి విషయంలోనూ జగన్ వ్యాఖ్యలు సరికాదు. ఆయన మతంలోనూ ఇలాగే జరిగి ఉంటే చిన్న విషయమేనని కొట్టిపారేసేవారా?
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

ప్రాంతీయం

నేడే బోధన్ డివిజన్‌లో సర్పంచ్ ఎన్నికలు

- భారీగా పోలీసుల బందోబస్తు

ప్రతిపక్షం, బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 10 : జిల్లాలో మొదటి విడతలో బోధన్ రెవెన్యూ డివిజన్లో నేడు ఎన్నికలు జరుగనున్నాయి. గ్రామ పంచాయతి ఎన్నికల నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ కమీషనర్ సాయి చైతన్య తెలిపారు. బోధన్ రెవెన్యూ డివిజన్లో గ్రామ పంచాయతి ఎన్నికలు సజావుగా జరిగేందుకు గాను అన్ని రకాల పకడ్బందీగా భారీ బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రజలందరూ ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, చట్టాన్ని అతిక్రమించేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని, ముఖ్యంగా గొడవలు సృష్టించే వ్యక్తులపై తమ దృష్టి ఉన్నదని హెచ్చరించారు. ప్రజలు పోలీసు శాఖ పట్ల ఎంతో స్నేహ భావంతో నమ్మకంతో ఉంటారని, ఎవ్వరికైనా శాంతిభద్రతలకు సమస్య ఏర్పడితే స్థానిక పోలీసులకు లేదా, డయల్ 100 కు ఫోన్ చేయాలని, ఎన్నికల సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైనా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

నకిరకొమ్ముల సర్పంచ్, వార్డు సభ్యులను అభినందించిన పొన్నం

ప్రతిపక్షం, కోహెడ, డిసెంబర్ 10: హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలం నకిరకొమ్ముల గ్రామ పంచాయతీ సర్పంచ్ తో సహా వార్డు మెంబర్లు ఏకగ్రీవం కావడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు హైదరాబాదులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన నకిరకొమ్ముల గ్రామ సర్పంచ్ బుర్ర కళ్యాణి మహేష్, ఉప సర్పంచ్ శ్రీగిరి సూర్యకళ వెంకటేష్, వార్డు మెంబర్లు బొల్లి సంపత్, గుడ్ల ఉమ అశోక్, బుర్ర శ్రీలత శ్రీనివాస్, దక్షిణమూర్తి, సుమలత, గట్టు రమేష్, జాగిడి పర్శరాములును మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించి సత్కరించారు. గ్రామ అభివృద్ధికి అండగా ఉంటానని, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, గ్రామాల్లో ప్రజలందరు ఇలాగే ఐక్యంగా ఉండి మార్పు చూపెట్టడానికి ఆదర్శంగా ఉండాలని మంత్రి పొన్నం అన్నారు.

పెద్దపల్లికి సెమీకండక్టర్ పరిశ్రమ ఇవ్వండి

- లోక్‌సభలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 10: పెద్దపల్లి జిల్లాలో సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని బలంగా కోరారు. ఎంపీ పార్లమెంట్ లో మాట్లాడుతూ వివరించారు. పెద్దపల్లి ఒక అతిపెద్ద ఇండస్ట్రియల్ హబ్ అని, మా జిల్లాలో అత్యంత ప్రతిభావంతమైన, టెక్నికల్ గా స్కిల్డ్ యూత్ ఉన్నారు. కానీ నిరుద్యోగం చాలా ఎక్కువగా ఉంది. పెద్దపల్లిలో సెమీకండక్టర్ ఫెసిలిటీ వస్తే, వేలాది యువతకు ఉద్యోగాలు కలుగుతాయి. రాష్ట్రానికి, దేశానికి కూడా భారీగా మేలు జరుగుతుంది. అంతేకాకుండా, ఇటీవల వేరే రాష్ట్రానికి ఇచ్చినట్లు గా సెమీకండక్టర్ ప్రాజెక్ట్ పెద్దపల్లికి కూడా రావాల్సినదేనని ఎంపీ గారు గుర్తు చేశారు. పరిశ్రమలకు కావాల్సిన భూమి, నీటి వనరులు, విద్యుత్, లాజిస్టిక్స్ అన్నీ పెద్దపల్లిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పెద్దపల్లిని సెమీకండక్టర్ హబ్‌గా అభివృద్ధి చేయాలని కేంద్ర పరిశ్రమల శాఖ చర్యలు తీసుకోవాలి" అని ఎంపీ డిమాండ్ చేశారు.

మనో చైతన్య వృత్తి శిక్షణకేంద్రాన్ని సందర్శించిన ఆర్జీ1 జీఎం

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, డిసెంబర్ 10: మనో చైతన్య వృత్తి శిక్షణకేంద్రాన్ని ఆర్జీ1 జీఎం లలిత్ కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మొదట మనోచైతన్య వృత్తి శిక్షణ కేంద్ర నిర్వాహకులతో పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. వృత్తి శిక్షణ కేంద్ర నిర్వాహకులు ఇక్కడ నెలకొల్పిన పరిశ్రమల గురించి, విద్యార్థులు తయారు చేస్తున్న వాటి గురించి జీఎంకు వివరించారు. జీఎం మాట్లాడుతూ ఇక్కడ వృత్తి శిక్షణ కేంద్రంలో మనో వైకల్యం కూడా మరిచిపోయి దివ్యాంగులైన పిల్లలు వారిలో దాగి ఉన్న ప్రతిభ పాఠవాలు మెరుగు పర్చేందుకు ఇక్కడి కేంద్రంలో వారిని సమాజంలో వివక్షకు గురికాకుండా అందరిలా సమాజంలో భాగం చేయాలని, వారికి అందరిలాగే విద్య, ఉద్యోగ అవకాశాలు వృత్తి శిక్షణ కార్యక్రమాలు కల్పించినపుడు వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఈ విధమైన వాతావరణం కల్పించినపుడు వారి మానసికఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మనోచైతన్య వృత్తి శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తూ మానసిక వికలాంగులతో తయారు చేస్తున్న స్వీట్ బాక్స్, బుక్స్ తయారు, టీ కప్స్ తయారు, అగరువత్తులు తయారు చేయడం, ఎన్వలప్‌కవర్స్, ఫైల్స్, ఫ్యాడ్స్, పేపర్ బైండింగ్, చాక్ పీస్లు తయారు చేయడం జీఎం సందర్శించి మానసిక వికలాంగుల పిల్లలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీనియర్ పర్సనల్ మేనేజర్ హన్మంత రావు, మనోచైతన్య బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా తేజస్వి ప్రకాష్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 10: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్ ను కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్ చార్జ్‌గా నియమిస్తూ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లాలో యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని సూచించారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, జక్కిడి శివ చరణ్ రెడ్డికి, యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి సయ్యద్ ఖలీద్ అహ్మద్ కి, తేజస్వి ప్రకాష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. తేజస్వి నియామకంపై కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు

"



అధ్యక్షుడిగా తన తొలి టర్మ్‌లో యూఎస్ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే బలమైనదిగా నిలిపాను. ఈసారి మరింత పెద్దగా, గతంలో ఎన్నడూ చూడని దృఢమైన వ్యవస్థను నిర్మిస్తా. దీని కోసం చాలా శ్రమించాల్సి ఉంది. ఆర్థిక వ్యవస్థకు తోడ్పడకపోతే దేశ పౌరులుగా ఉండాల్సిన అవసరం లేదు. తాను అధికారంలోకి రాకముందు కొత్త ఉద్యోగాలన్నీ వలసదారులకు వెళ్లేవి. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది.

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

మొదటి దశ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, డిసెంబర్ 10 : మొదటి దశ గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం ఖానాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని, జిల్లా ఎస్పీ జానకి లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అందరూ ప్రశాంతంగా ఉండి, ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ కొరకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని అన్నారు. ఎన్నికల నిర్వహణ సమయంలో ఓపికగా ఉండాలని అన్నారు. అన్ని ఫారములను తప్పులు లేకుండా పూరిస్తూ, ఓటింగ్ సరళి వివరాలను పంపాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియలు పారదర్శకంగా చేపట్టాలని అన్నారు. కౌంటర్ల వారీగా తిరుగుతూ, అన్ని పోలింగ్ ప్రతులు, ఫారములు, ఇతర ఎన్నికల సామాగ్రి ఆయా రూట్ల, పోలింగ్ కేంద్రాల వారిగా అందయో లేదో ఎన్నికల విధులు నిర్వహించబోయే అధికారులను అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు సమయానికి భోజనం అందించాలని అన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలను తీసుకున్నామని అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ పరిశీలనలో మండల ప్రత్యేక అధికారి (సిపిఓ) జీవరత్నం, డీఈవో భోజన్న, తహసిల్దార్ సుజాత, ఎంపీడీఓ రమాకాంత్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడత పోలింగ్ కు సర్వం సిద్ధం

ప్రతిపక్షం ,హనుమకొండ, డిసెంబర్10: హనుమకొండ జిల్లాలో గురువారం జరగనున్న మొదటి విడత ఎన్నికల పోలింగ్ కు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కమలాపూర్ లోని మోడల్ స్కూల్ లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేయగా గ్రామ పంచాయతీల వారీగా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది కేటాయింపు, పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆయా ఎంతమంది పోలింగ్ సిబ్బంది హాజరయ్యారని, ఎన్ని కౌంటర్లను ఏర్పాటు చేశారని, ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు ఎన్ని వాహనాలను ఏర్పాటు చేశారని, ఎన్నికల సిబ్బంది కోసం ఏర్పాటుచేసిన భోజన సదుపాయాల గురించి కలెక్టర్ పరిశీలించి వివరాలను ఎంపీడీవోలు వీరేశం, బాబులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లను, హెల్ప్ డెస్క్ లను కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ సిబ్బంది కేటాయింపు, పోలింగ్ సామగ్రి పంపిణీని కలెక్టర్ పరిశీలించి అధికారులను వివరాల అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల వారీగా రూట్స్ అలాట్ చేసి జోనల్ రూట్ ఆఫీసర్లు సమన్వయంతో ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు చేర్చాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీసీఈవో రవి, భీమదేవరపల్లి, కమలాపూర్ తహసిల్దార్లు రాజేష్, సురేష్ కుమార్ ప్రత్యేకాధికారులు అనసూయ, నరసింహస్వామి, జోనల్, రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

గొప్య నాయక్ తండా సర్పంచ్ ఏకగ్రీవం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 10 : రూరల్ నియోజక వర్గం సిరికొండ మండలం గొప్య నాయక్ తండా సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన మాలవత్ సుబ్బా రవి నాయక్, ఉపసర్పంచ్ బాధవత్ బంకట్ లాల్, వార్డు మెంబర్లు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిశారు. నగరంలోని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నికైన వారు ఎమ్మెల్యే భూపాతిరెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు రవి, మాజీ వైస్ ఎంపీపీ బాలరాజ్, నాయకులు లింగం, శ్రీను, రాములు నాయక్, మాజీ సర్పంచ్ శంకర్ లాల్, రెడ్డి నాయక్, బందర్ నాయక్ గ్రామ తండా ప్రజలు వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

రైలు ఎక్కబోతు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 10 : నిజామాబాద్ రైల్వే స్టేషన్లో రైలు ఎక్కబోతు గుర్తు తెలియని ఒకరు మృతి చెందినట్లు రైల్వే ఎస్సై హెచ్ సాయారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 6 గం లోపు నిజామాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ 3 పై ఓ గుర్తు తెలియని గుర్తు తెలియని వయస్సు సుమారు 40 సంవత్సరాలు రైలు ఎక్కబోతు ప్రమాదవశాత్తు రైలు ట్రాక్ ప్లాట్ ఫామ్ మధ్య లో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం 7 గంటలకు రైల్వే పోలీసులకు వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం రావటంతో అక్కడికి వెళ్ళి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడిని గుర్తించుటకు ఎటువంటి ఆధారాలు లభించ లేదని, మృతుని కుడి చేయికి మధ్య వేలు తెగి ఉన్నట్లు తెలిపారు. మృతునికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే 8712568440 సంప్రదించాలని ఎస్సై కోరారు.



ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా సజావుగా జరగాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- నేడు మొదటి విడత పోలింగ్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, డిసెంబర్ 10: గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా లోని రాజంపేట్, దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. మొదటి విడత డిసెంబర్ 11 న ఎన్నికల సందర్భంగా మొత్తం గ్రామ పంచాయతీలు 167, ఎన్నికలు జరుగుతున్న జీపీలు 157, పూర్తి సంస్థ ఏకగ్రీవంగా ఎన్నికైన జీపీలు 10, మొత్తం పోలింగ్ స్టేషన్లు: 1533, ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లు 1457, పూర్తి సంస్థ ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డులు 76, పురుష ఓటర్లు: 1,18,342, మహిళా ఓటర్లు: 1,30,322, ఇతరులు: 4, మొత్తం ఓటర్లు: 2,48,668 ఉన్నారని తెలిపారు. సిబ్బంది నియామకం (Phase-I): పోలింగ్ అధికారులు (PO): 1848, ఇతర పోలింగ్ అధికారులు (OPO): 2501 ఉన్నారన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారి అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ అధికారులకు ఇచ్చిన ఎన్నికల సామాగ్రి, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారి గా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్త గా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కల్పించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలలో , తదితర ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, అడ్డంకిలేకుండా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలి

- పోలింగ్‌సామాగ్రి తరలింపును పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం, రంగారెడ్డి జిల్లా, డిసెంబర్10: మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శంషాబాద్ జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ అధికారులకు ఇచ్చిన ఎలక్షన్ మెటీరియల్ పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామగ్రిని పోలింగ్ కేంద్రం వారీగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. మైక్రో అబ్సర్వర్లతో మాట్లాడి పలు సూచనలు చేసారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలు, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పోలింగ్ సిబ్బంది నిర్వహించే వారి విధులను క్షుణ్ణం గా వివరించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ నగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి, శంషాబాద్ తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మున్ని, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛ, శాంతియుతంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, డిసెంబర్ 10 : పోలీసుల పటిష్టమైన భద్రతతో స్వేచ్ఛ, నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్ మొదటి విడత కాల్వ శ్రీరాంపూర్, కమాన్ పూర్, రామగిరి, మంథని, ముత్తారం 5 మండలాలలో 95 గ్రామ పంచాయతీలు 685 పోలింగ్ కేంద్రాలలో, 135 పోలింగ్ లొకేషన్స్, మంచిర్యాల జోన్ పరిధిలో దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట 4 మండలాలలో 81 గ్రామపంచాయతీలు, 514 పోలింగ్ కేంద్రాలలో 143 పోలింగ్ లొకేషన్స్ మొత్తం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి లో 1,712 పోలింగ్ కేంద్రాలలో సాధారణ పోలింగ్ కేంద్రాలు 1,174, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు 538, ఎన్నికల ముందు రోజు, ఎన్నికల రోజు, ఫలితాలు వెల్లడించిన తరువాత ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు, గొడవలు జరగకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 35 గన్ లైసెన్లు కలిగిన 34 మంది గన్స్ డిపాజిట్ చేయడం జరిగిందని, 1 ట్రాన్స్ఫర్ చేయడం జరిగిందని తెలిపారు. 1,600 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. నిబంధనలకు విరుద్ధం, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు శాంతియుతంగా, ధైర్యంగా స్వేచ్ఛయుత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించు టకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

ప్రాంతీయం

అభివృద్ధి సంక్షేమానికే పట్టం కట్టండి

- అధికారంలో ఉన్న పార్టీ కి ఓటేస్తేనే గ్రామాల అభివృద్ధి
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 10 సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావు అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని అయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మెదక్ మండలం మాచవరం, ర్యాల మడుగుగు, పేరూరు, రాజ్ పల్లి, మక్త భూపతి పూర్, పాతూర్ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలో ఉన్న పార్టీకి ఓటేసి గెలిపిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు బలపరిచిన అభ్యర్థులకు ఓటేసి ఓటు వృధా చేసుకోవద్దు అని అన్నారు. డబ్బు, మద్యానికి ఆశపడి పల్లెలు ఆగం చేసుకోవద్దని కోరారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేయాలని గ్రామ అభివృద్ధి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాలని తెలిపారు. స గ్రామం అభివృద్ధి చెందాలన్నా, గ్రామ సమస్యలు పరిష్కారం కావాలన్నా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను మాత్రమే గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఇంకా మూడేండ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని, ఎమ్మెల్యే గా నేను ఉంటానని గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఇతర పార్టీ అభ్యర్థులు గెలిస్తే, ప్రభుత్వం దగ్గరకు, ఎమ్మెల్యే దగ్గరకు రాలేదని, గ్రామంలో ఏ రకమైన అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశం ఉండదన్నారు. కావున గ్రామ ప్రజలు గ్రామ అభివృద్ధిని పార్టీల అభ్యర్థులు ఇచ్చే మద్యం, డబ్బులకు ఆశ పడి, వాళ్ళు చెప్పే మాయ మాటలు నమ్మి వారికీ ఓటు వేస్తే గ్రామంలో జరగాల్సిన అభివృద్ధి ఆగిపోతుందని దృష్టిలో పెట్టుకొని ఓటు వేయాలని కోరారు. ఈ ఎన్నికలు గ్రామ అభివృద్ధికి సంబందించిన ఎన్నికలని మన గ్రామ అభివృద్ధి మన చేతుల్లోనే ఉందని కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తెలంగాణ ను సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే ఎక్కడా లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. 25 లక్షల మంది రైతులకు రూ 21వేల కోట్ల రుణ మాఫీ చేయడం, 9రోజుల్లో 9వేల కోట్లు రైతులకు పెట్టుబడి సాయం అందించడం ఒక చరిత్ర అని కొనియాడారు. సన్నాలకు రూ 500 బోనస్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలు చేస్తూ రైతులకు అండగా ప్రభుత్వం నిలబడుతుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ అవసరాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణి, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు వంటి ప్రజా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు రావాలన్నా, సిసి రోడ్లు నిర్మాణం కావాలన్నా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాలలో సర్పంచ్ అభ్యర్థులు శ్రీనివాస్ చౌదరి, నాగరాజు, ఆంజనేయులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ మోల్సాబ్, తిరుపతి రెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ ఆయా గ్రామాల సర్పంచ్, వార్డు అభ్యర్థులు, మండల నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

- స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి
- మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 10: ప్రజా సమస్యలను గాలికొదిలేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మెదక్ జిల్లా నిజాంపేట్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల. శశిధర్ రెడ్డి, నిజాంపేట్ మండల నాయకులతో కలసి బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి వెల్దుర్తి. శ్రీకాంత్ గౌడ్, వార్డు సభ్యుల గెలుపు కోసం వారి తరపున మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో ఏ గ్రామానికి వెళ్లినా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులే కనబడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలే బీఆర్ఎస్ అభ్యర్థుల విజయాలుగా మారనున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేండ్లు గడుస్తున్నా, ఏ ఒక్క పథకాన్ని సక్రమంగా అమలు చేయలేక పోయిందని విమర్శించారు. నేడు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల్లో వాగ్దానం చేసిన ఆరు గ్యారంటీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి ఈ సర్పంచ్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి చెప్పాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపిన సర్పంచ్ అభ్యర్థులకు ఓటేసి బారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ప్రచారంలో నిజాంపేట్ పట్టణ పార్టీ అధ్యక్షులు, నాగరాజు, పిఎసిఎస్ చైర్మన్. బాపురెడ్డి, మాజీ కో ఆప్షన్ అబ్దుల్ అజిత్, మాజీ సర్పంచ్ తిరుమల్ గౌడ్, మాజీ ఎంపిటిసి వెంకటస్వామి, బిఆర్ఎస్ నాయకులు స్వామి గౌడ్, లచ్చపేట రామగౌడ్, తాడేం మల్లేశం, నాయిని మహేష్ రంజిత్ గౌడ్, మౌరం రాజు నాయిని లక్ష్మణ్, మహమ్మద్ పజిల్ పంపరి శివ, పంపరి రాజశేఖర్, బోప్పరం రాజు రెడ్డి, రాకేష్ బండారి తిరుమల్ కొమ్మాట చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక లోకానికి తీవ్ర నష్టం

- బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 10: కార్మికులు ఎంతో పోరాటం చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులు వద్దంటున్నా లేబర్ కోడ్లను కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు పరచాలని చూస్తుందని బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బీఆర్టీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మంచె నరసింహులు తో కలిసి రాంబాబు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న లేబర్ కోడ్ ల వల్ల కార్మిక లోకానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. కార్మిక సంఘాలన్నీ ఏకమై జెండాలు పక్కన పెట్టి లేబర్ కోడ్ లను రద్దు చేయడమే ఎజెండాగా కలిసి పనిచేయాలని కోరారు. లేబర్ కోడ్లను పార్లమెంట్లో వ్యతిరేకించి తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ లేబర్ కోట్లపై స్పష్టమైన వైఖరి తెలపాలన్నారు. అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని లేబర్ కోడ్ లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసేంతవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు పిండి అరవింద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి నర్సింలు, బీడీ సంఘం జిల్లా అధ్యక్షులు శోభన్, నాయకులు సంజీవులు, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో మౌలిక వసతులు కల్పించాలి

- జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానందం

ప్రతిపక్షం, ప్రతినిధి మెదక్, డిసెంబర్10: ప్రజలకు పెట్రోల్ బంకుల్లో మౌలిక వసతులు కల్పించాలని పౌరసరఫరాల అధికారి పీ నిత్యానందం బంకు నిర్వాహకులకు సూచించారు. బుధవారం మెదక్ పట్టణంలోని శ్రీనివాస పెట్రోల్ బంక్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా ఇంధన కొలతలు, నాణ్యత, ధరల ప్రదర్శన, భద్రతా ప్రమాణాలు, వినియోగదారులకు కల్పించాల్సిన కనీస మౌలిక వసతులను పరిశీలించారు. తనిఖీలో ఇంధన కొలతల్లో తేడాలు, ఫిల్టర్ పేపర్ టెస్ట్‌లో అనుమానాస్పద ఫలితాలు, తాగునీరు -టాయిలెట్స్-ఫస్ట్ ఎయిడ్, టైర్లకు ఉచిత గాలి వంటి సదుపాయాల లేమి వంటి పలు లోపాలు బయటపడ్డాయి. చట్టప్రకారం పెట్రోల్ బంకుల్లో ఈ సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసిన అధికారి, వినియోగదారులను మోసం చేసే విధంగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించారు. ఈ అయన మాట్లాడుతూ.. ఇంధనాన్ని ఖచ్చితమైన కొలతలతో, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా విక్రయించడం బంక్ నిర్వాహకుల చట్టబద్ధ బాధ్యత అని అన్నారు. వినియోగదారుల హక్కులను ఉల్లంఘించే ఏ అక్రమానికీ ప్రభుత్వం సహనం వహించదు అని హెచ్చరించారు. బంక్‌పై ప్రాథమిక కేసు నమోదు చేసి, సంబంధిత చట్టాల కింద వివరణ కోరినట్లు, అవసరమైతే బంక్‌ను సీజ్ చేయడం సహా కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వాహనదారులకు ఇంధన నాణ్యత, కొలతపై సంబంధించిన అనుమానాలు ఉన్నప్పుడు బంకులో ఉండే కొలత క్వాలిటీ చెక్ సామగ్రి చూపించాలని డిమాండ్ చేయొచ్చని, అలాంటి సహకారం అందించనపక్షంలో వెంటనే పౌర సరఫరాల/లీగల్ మెట్రాలజీ శాఖకు ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే బంకులపై ఎటువంటి కనికరం చూపబోమని స్పష్టం చేశారు.

పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

- జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు
- పాపన్నపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిబ్బందికి ఎన్నికల అవగాహనా కార్యక్రమం.

ప్రతిపక్షం మెదక్ టౌన్, డిసెంబర్ 10: మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పాక్షపాతంగా నిర్వహించేందుకు మెదక్ జిల్లా పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు వెల్లడించారు. ఎన్నికల పోలింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, పూర్తి స్థాయి భద్రతా ప్రణాళికను రూపొందించి పటిష్ట బందోబస్తు అమలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం మెదక్ జిల్లా పాపన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పోలింగ్ బందోబస్తు, రూట్ మొబైల్ బందోబస్తు, పోలింగ్ స్టేషన్ భద్రత, సెక్టార్ మొబైల్, స్ట్రైకింగ్ ఫోర్స్ వంటి విభాగాల సిబ్బందికి ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. పోలీస్ సిబ్బంది చేపట్టాల్సిన బాధ్యతలు, అనుసరించాల్సిన విధి విధానాలు, తక్షణ స్పందన చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో చిన్న చిన్న వివాదాలే పెద్ద సంఘటనలకు దారితీసే అవకాశం ఉంటుందని, అందుకే ముందస్తు భద్రతా చర్యలు తీసుకొని ప్రతి గ్రామంలో, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల పర్యవేక్షణ అధికారుల సమన్వయంతో వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో ఏ చిన్న ఉద్రిక్తత అనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకూ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ప్రదర్శనలు, బాణసంచా పేల్చడం వంటి కార్యకలాపాలకు పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ లు రాజశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శైలందర్, సందీప్ రెడ్డి, ఎస్సై శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణ తెలిపేది దుస్తులే

- సినీ నటి అనసూయ భరద్వాజ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్10: మెదక్ జిల్లా కేంద్రంలో కిషన్ క్లాత్ షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు. సినీ యాక్టర్ యాక్టర్ అనసూయ పాల్గొన్నారు. అనసూయ షోరూమ్ వద్దకు చేరుకోగా జనాలు ఒక్కసారిగా ఆమె చూడడానికి అక్కడికి చేరుకున్నారు. షోరూమ్ లో అనసూయ సందడి చేశారు. ఈ సందర్భంగా షోరూం యజమాని ధన్పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ 66 సంవత్సరాల క్రితం రైతు బట్టలతో షో రూమ్ ప్రారంభమైందని.. వ్యాపారం పార్టీలకతీతంగా కొనసాగిస్తున్నామన్నాడు. యాంకర్ సినీ నటి అనసూయ మాట్లాడుతూ మెదక్ లో షాప్ ఓపెనింగ్ చేయడం సంతోషంగా ఉందన్నారు. క్రమశిక్షణ అంటేనే వస్త్రధారణ అని అన్నారు. కుటుంబసమేతంగా షాపింగ్ చేయాలన్నారు.

గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

ప్రతిపక్షం, మిరుదొడ్డి, డిసెంబర్ 10: గల్లి, ఢిల్లీలో అధికారంలో లేని పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపిస్తే, గ్రామాల అభివృద్ధి సాధ్యం కాదని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. పల్లెల అభివృద్ధి బిజెపితోనే సాధ్యమని వెల్లడించారు. బుధవారం మిరుదొడ్డి మండల కేంద్రంలో బీజేపీ పార్టీకి చెందిన కానుగంటి స్వప్నశ్రీనివాస్ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. స్వప్న గెలుపు కోసం ఏర్పాటు చేసిన రోడ్ షోలో ఎంపీ రఘునందన్ రావు పాల్గొని ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో మిరుదొడ్డి గ్రామం అభివృద్ధిలో కుంటపడిపోయిందని ఆరోపించారు. ఎమ్మెల్యేగా తనపై డబ్బులు పంచి గెలిచిన నాయకుడు ఇప్పుడు మిరుదొడ్డి వైపు రావడం లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు డబ్బులు లేవని పాలన సాగించడం చేతకాక చేతులెత్తేయడం జరుగుతుందన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో లేదని, కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో లేదని, ఆ పార్టీల నాయకులకు ఓటు వేసి గెలిపిస్తే గ్రామాల్లో అభివృద్ధి జరగదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. బిజెపి నాయకులను పల్లెల్లో సర్పంచ్ లుగా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు అమర్, బిజెపి నాయకులు కమ్మరి స్వామి, మొగుళ్ళ మల్లేష్ యాదవ్, బిక్షపతి, రోశయ్య, మొగుళ్ళ స్వామి తోపాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 10: పోలింగ్ సిబ్బంది అన్ని సామాగ్రిని పూర్తిగా పరీక్షించుకుని, ఉదయం 7 గంటలకు సమయానికి పోలింగ్ ప్రారంభించాల్సిందిగా జిల్లా కలెక్టర్ హైమావతి స్పష్టం చేశారు. 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు 2025 ప్రక్రియలో భాగంగా బుధవారం నాడు గజ్వేల్ ఐఓసి కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రంతో పాటు జిల్లాలో మొదటి విడతలో 7 మండలాల్లో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలలో ములుగు మండలం సంబంధించి ములుగు రైతు వేదిక, రాయపోల్ మండలం సంబంధించి జీఎల్ఆర్ గార్డెన్, దౌలతాబాద్ మండలం తెలంగాణ మెడల్ స్కూల్ లో నిర్వహించిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ లను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 7 మండలాల్లో ఆయా మండలాల సంబంధించిన పలు కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడం జరుగుతుంది. పిఓ, ఓపిఓ మీకు అందజేయబడిన పోలింగ్ సామాగ్రిని అన్ని చెక్ చేసుకోవాలని, బ్యాలెట్ పేపర్ లు లెక్కబెట్టుకోవాలని తెలిపారు. బ్యాలెట్ బ్యాక్ ఉపయోగించే ప్రక్రియ గురించి ఎలాంటి సందేశాలు ఉన్నా ఇక్కడే మాస్టర్ ట్రైనర్ లను అడిగి పరిష్కరించుకోవాలి. పోలింగ్ మెటీరియల్ తీసుకుని వివిధ రూట్లలో మీకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు వెళ్ళిన తర్వాత పోలింగ్ స్టేషన్ లో ఫర్నిచర్, బ్యాలెట్ బాక్స్ ఆయా మెటీరియల్ అన్ని అన్ని సెట్ చేసుకోవాలని తెలిపారు. రేపు ఉదయం 6 గంటలకే అన్ని సిద్ధం చేసుకుని మాక్ పోలింగ్ చేసిన తరవాత తప్పనిసరిగా 7 గంటలకు ఓటింగ్ ప్రక్రియ మొదలు పెట్టాలని ప్రతి 2 గంటలకొకసారి పోలింగ్ శాతాన్ని తెలపాలని ఆదేశించారు. మధ్యాహ్నం 1 వరకు ఓట్లు వేయడానికి ఓటర్లు ఉంటే వారు ఓటు వేసిన తరవాత క్లోజ్ చేసి బ్యాలెట్ బాక్సు కి సీల్ వేయాలి. మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించాలని తెలిపారు. కౌంటింగ్ సెంటర్ లో ఏజెంట్లు, పోలింగ్ సిబ్బంది ఫోన్ కి అనుమతి లేదని కౌంటింగ్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా చేశాకే పై అధికారుల అనుమతితో ఫలితాలు రిలీజ్ చెయ్యాలని తెలిపారు. మీకు ఎలాంటి సమస్యలు ఎదురైనా మీకు అందజేయబడిన కరదీపికను చదివి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. అన్ని సౌకర్యాలు ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు సమకూరుస్తారని తెలిపారు. ఎన్నికల విధులకు గైర్హాజరు అయిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని డి ఈ ఓ ను ఆదేశించారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం ఓటింగ్ కౌంటింగ్ ప్రక్రియ ను విజయవంతం చెయ్యాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, ఆయా మండల ఎంపిడిఓ, తహసిల్దార్ తదితరులు ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించు గ్రామాభివృద్ధి సాధించు..

- ప్రఖ్యాత చిత్రకారులు రుస్తుం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 10 : సర్పంచ్ ఎన్నికలను పురస్కరించుకుని బుదవారం రుస్తుం ఆర్ట్ గ్యాలరీ సిద్దిపేట లో 'ఓటరు చైతన్యం' చిత్రాన్ని అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎప్పటినుండో ఎదురుచూచే ఓటు వేసే సదావకాశం అధికారం వచ్చిందనీ, సర్పంచ్, వార్డ్ మెంబర్లను నిశితంగా పరిశీలించి ఆచితూచి ఓటు వేయండి అని సూచించారు. ఎక్కడ ఓట్ల శాతం అధికంగా ఉంటుందో అక్కడ ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందన్నారు. గ్రామం ఐక్యమత్యంగా శాంతియుతంగా మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతాయనీ, అందుకే ప్రతిఒక్కరు ప్రలోభాలకు లొంగకుండా మనః సాక్షిగా ఓటు హక్కును వినియోగించు కోవాలని, గ్రామాభివృద్ధిలో పాలుపంచుకోవాలని మానవతా చిత్రకారులు రుస్తుం ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఏ ఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం తదితరులు పాల్గొన్నారు.



మా దేశం పేరు సంస్కృతం నుంచే వచ్చింది. సింగపూర్ లేదా సింగపురా అనే పేరు సంస్కృతం నుంచి ఉద్భవించింది. భారత్-, సింగపూర్ మధ్య చారిత్రక అనుబంధం ఉంది. 1867 వరకు కోల్‌కతా నుంచి సింగపూర్ పరిపాలన జరిగింది. తమ దేశ ఆర్థిక, సాంస్కృతిక నిర్మాణంలో భారతీయులు కీలకపాత్ర పోషించారు.
- సింగపూర్‌మాజీ ఉప ప్రధాని తియో చీ హియాన్

ప్రాంతీయం

సిద్దిపేట రూరల్‌లో కోటగిరి ప్రభాకర్ ఇంటింటి ప్రచారం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 10: సిద్దిపేట రూరల్ మండలంలోని వెంకటాపురం గ్రామంలో సర్పంచ్ పదవి కోసం అభ్యర్థిగా బరిలో దిగిన కోటగిరి ప్రభాకర్ మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని మౌలిక వసతుల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. రైతులు కల్లాలు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఐకెపి సెంటర్లు ఏర్పాటు చేస్తామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు.

సిద్దిపేట అర్బన్‌లో
బాలకృష్ణ రెడ్డి ఇంటింటి ప్రచారం..
సిద్దిపేట అర్బన్ మండలంలోని ఎల్లుపల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి బాలకృష్ణ రెడ్డి మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామ ప్రజలతో సమావేశమై అభివృద్ధి కార్యక్రమాలు, అవసరాలపై చర్చించారు. గ్రామ సమస్యలను గుర్తించి పరిష్కారంపై దృష్టి పెడతానని హామీ ఇచ్చారు.

అవకాశం ఇవ్వండి.. అండగా ఉంటా

- ఖమ్మంపల్లి సర్పంచ్ అభ్యర్థి కరుణాకర్ రెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్ (కొండపాక), డిసెంబర్ 10: గ్రామ సర్పంచ్ గా తనను గెలిపిస్తే గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని కొండపాక మండలం ఖమ్మంపల్లి సర్పంచ్ అభ్యర్థి తిమ్మపురం కరుణాకర్ రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం గ్రామంలోని పలు విధుల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తూ "ఉంగరం" గుర్తుకు ఓటు వేసి తనను సర్పంచ్ గా గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే గ్రామంలోని ఆడపడుచుల వివాహానికి 11వేలు, ఆడపిల్ల పుడుతే 11 వేల రూపాయల సాయం చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలోని ఎవరికైనా ఆపద వస్తే 5 వేల రూపాయల సాయం చేస్తానని అన్నారు. గతంలో గ్రామంలో చేసిన సేవాకార్యక్రమాలను గ్రామస్తులకు వివరించారు. గ్రామ ప్రజలు ఆలోచించి ఓట్లు వేసి తనను బారీ మెజారిటీతో సర్పంచ్ గా గెలిపించాలని కొరారు. అన్ని విధాల గ్రామాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. గ్రామంలో చదువుకున్న యువతి, యువకులకు సిద్దిపేట పరిసర పరిశ్రమలలో అర్హతలను బట్టి ఉద్యోగ, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈసారి తనను సర్పంచిగా గెలిపించి అవకాశం ఇస్తే ఐదేళ్లలో అన్ని రంగాలలో గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రచారంలో ఆయన వెంట గ్రామ పెద్దలు,యువకులు,ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారం లో నిర్వహించారు.

సిద్దిపేట ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్
అధ్యక్షుడిగా కోమటిరెడ్డి జీవన్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 10 : సిద్దిపేట ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడతానని నూతన అధ్యక్షులు కోమటిరెడ్డి జీవన్ రెడ్డి అన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నికకు సహకరించిన సభ్యులందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. బుధవారం సిద్దిపేట ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్ 73 మంది సభ్యులతో కోమటి చెరువు కట్ట వద్ద సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షునిగా జీవన్ రెడ్డి ఎన్నుకున్నారు . గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సిద్దిపేట లోనే ఆదర్శంగా నిలిచినటువంటి సిద్దిపేట కోమటి చెరువు ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్ అని అన్నారు. గతంలో కరోనా సంవత్సరంలో కూడా అసోసియేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. సిద్దిపేట పట్టణ ప్రజా ప్రతినిధుల సహకారంతో అసోసియేషన్ను మరింత ముందుకు తీసుకపోవడం జరుగుతుందన్నారు.నూతన అధ్యక్షునిగా కోమటిరెడ్డి జీవన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శిగా : నక్కి రెడ్డి కిషన్ రెడ్డి ,ఉపాధ్యక్షులుగా:పిటిల సుధాకర్ , కెమ్మసారం రాజేష్ ఖన్నా , మైపాల్ రెడ్డి సహాయ కార్యదర్శిగా : కోమటిరెడ్డి అంజిరెడ్డి, క్యాషియర్ గా : సుక్క చంద్రంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నుకోవడంతో అసోసియేషన్ అభివృద్ధికి తాను ఎల్లవేళలా పాటు పడతానన్నారు.

వైద్య విధాన పరిషత్ ను రద్దు చేయాలి

- జిల్లా ఆసుపత్రి ఉద్యోగుల సంఘం

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 10: వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల వేతనాలను 010 అకౌంట్ ద్వారా చెల్లించాలని, వైద్య విధాన పరిషత్ రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు ద్వారా ప్రక్రియని పూర్తిచేయాలని కోరుతూ గజ్వేల్ పట్టణంలో బుధవారం జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అన్నపూర్ణ కు ఆసుపత్రి సిబ్బంది సామూహిక సంతకాలతో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన ఖాతా ద్వారా వేతనాలు చెల్లించడం వల్ల వేతనాల చెల్లింపులో పారదర్శకత, ఉద్యోగ భద్రత, సేవానిబంధనల్లో స్పష్టత లభిస్తుందని ఉన్నారు..ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓలు, వైద్యులు, నర్సింగ్ అధికారులు, పారా వైద్య సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలకు భద్రత ఏర్పాట్లు పూర్తి

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- 843 మంది పోలీసులతో బందోబస్తు

ప్రతిపక్షం ప్రతినిధి, జగిత్యాల, డిసెంబర్ 10: జిల్లాలో జరుగుతున్న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. బీమారం, కోరుట్ల, మెట్పల్లిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను అదనపు ఎస్పీతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గతంలో జరిగిన ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని అదే స్ఫూర్తితో సర్పంచ్ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహిస్తామని అన్నారు. మొదటి విడతకి సంబంధించి 1,172 పోలింగ్ కేంద్రాల లో పోలింగ్ జరుగుతుంది అని దీనికి సంబంధించి 843 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. పటిష్ట ఎస్కార్ట్ తో పోలింగ్ సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరుగుతుంది 46 రూట్లలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్ టీమ్స్ మరియు ఎస్ఐలతో పెట్రోలింగ్ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఓటర్లు ఎవ్వరూ కూడా సెల్ ఫోన్లు, మందుగుండు సామగ్రి, ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్, పోలింగ్ బూతు లోనికి తీసుకువెళ్లారాదని, సెల్ఫీలు దిగడం నిషేధమని అన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి, డీఎస్పీలు వెంకటరమణ, రాములు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రతిపక్షం, నంగునూరు, డిసెంబర్ 10: సిద్దిపేట జిల్లా సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్దిపేట అర్బన్ మండలం కిష్ట సాగర్ గ్రామానికి చెందిన నర్ర సాయి భరత రెడ్డి (22) మృతి చెందాడు. రాజగోపాల పేట రాజగోపాలపేట ఎస్సై టి.వివేక్ కథనం ప్రకారం... సాయి భరత్ రెడ్డి నంగునూరు లోని ఆర్ కె ఫుట్వేర్ షాపుకు వెళ్లి తిరిగి తన గ్రామం కిష్టసాగర్ వెళ్లడం కోసం సిద్దిపేట వైపు టీఎస్ 36ఎల్ 1408 నెంబర్ గల అపాచీ వాహనం పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నంగునూరు ఎమ్మార్వో కార్యాలయ వద్ద వివేకానంద స్వామి విగ్రహం వద్ద బైక్ ని అతివేగంగా అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా నడుపుతూ రావడంతో వాహనం పట్టు తప్పి కింద పడడంతో సాయి భరత్ రెడ్డి తల, చాతి భాగాలకు బలమైన దెబ్బలు తగిలి రక్త గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డ్యూటీ డాక్టర్ పరిశీలించి చనిపోయాడని తెలిపారు. తండ్రి నర్ర మధుసూదన్ రెడ్డి గారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రాజగోపాల పేట ఎస్సై వివేక్ తెలిపారు.

ప్రజా గొంతుకగా ముందుకు వస్తున్న ఆశీర్వదించండి

- పోతిరెడ్డిపల్లి సర్పంచ్ అభ్యర్థి కత్తుల భాస్కర్ రెడ్డి

ప్రతిపక్షం, చేర్యాల, డిసెంబర్ 10 : ప్రజా సమస్యల పరిష్కారానికై నిరంతర శ్రామికుడిగా మీ ముందుకు వస్తున్నా ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని పోతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి కత్తుల భాస్కర్ రెడ్డి కోరారు. గత 20 సంవత్సరాలుగా విద్యార్థి దశ నుండి ఎన్నో పోరాటాలు అనేక ఇబ్బందులు సైతం ఎదుర్కొని ఉన్నత చదువులు చదివిన విద్యావంతుడిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే నా జీవితాన్ని అంకితం చేసి సమస్యలపై అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేశానని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపించాలంటే మీ పూర్తి మద్దతుతో నన్ను ఆశీర్వదించి గెలిపించాలని గ్రామస్తులను కోరారు.

గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

ప్రతిపక్షం సిద్దిపేట,డిసెంబర్ 10: ఎన్సాన్ పల్లి గ్రామాన్ని హరీష్ రావు సహకారంతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి సర్పంచ్ అభ్యర్థి నాగుల స్రవంతి ప్రశాంత్ గౌడ్ అన్నారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరికి అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తానన్నారు. హరీష్‌రావు సహకారంతో అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ఆయన వెంట యువకులు,మహిళలు పాల్గొన్నారు.

అక్రమ మద్యం సీజ్

ప్రతిపక్షం,చేగుంట,డిసెంబర్10: ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తరలిస్తున్న అక్రమమద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. రామాయంపేట వైన్స్ నుండి చల్మెడ వైపు వాహనంలో (కారులో)తరలిస్తున్న 480 బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్న వాహనంతో పాటు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు రామాయంపేట ఎస్సై బాలరాజ్ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో మానవ హక్కుల దినోత్సవం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 10: సిద్దిపేట లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మానవ హక్కుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జీవన్ కుమార్ అధ్యక్షత వహించారు. రాజనీతి శాస్త్ర విభాగం, జాతీయ సేవా పథకం (NSS-II), IQAC సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ప్రసంగించిన ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ కుమార్ మానవ జీవితంలో మానవ హక్కుల ప్రాధాన్యాన్ని వివరిస్తూ విద్యార్థులు హక్కులతో పాటు బాధ్యతలను కూడా అర్థం చేసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శ్వేత మహిళా హక్కులు, వాటి రక్షణ అవసరాన్ని వివరించారు. IQAC కోఆర్డినేటర్ డాక్టర్ కే. స్రవంతి ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించారు.ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సామ సువర్ణాదేవి ప్రజాజీవనంలో హక్కుల వినియోగం సామాజిక అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో డి. కిషోర్, ఎం. హరి ప్రసాద్, డాక్టర్ ఎస్. స్వప్న తదితరులు పాల్గొన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో కార్యక్రమం విజయవంతమైంది. విద్యార్థులు ఉపన్యాసాలు ఇవ్వగా, ఆంగ్ల ఉపన్యాసకులు మహేందర్ సాంస్కృతిక కార్యక్రమంలో పాటలు ఆలపించారు. చరిత్ర ఉపన్యాసకులు సంతోష్ వందన సమర్పణ చేశారు.

పంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- సీపీ గౌస్ ఆలం వెల్లడి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 10 : కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేడు మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం అనంతరం, ఆయన ఎన్నికల బందోబస్తు ప్రణాళిక వివరాలను వెల్లడించారు. మొదటి విడత మండలాలు గంగాధర, చొప్పదండి, రామడుగు, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాలలో ఎన్నికలు జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీలు 92, మొత్తం పోలింగ్ కేంద్రాలు 866 ఏర్పాటు చేశారు. సున్నిత/సమస్యాత్మక కేంద్రాలు గత సంఘటనల ఆధారంగా గుర్తించిన సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించడంతో పాటు, వెబ్ కాస్టింగ్ లేదా మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో స్టాటిక్ పోలీసు పార్టీ, మరియు ప్రతి మార్గంలో (రూట్) రూట్ మొబైల్ పార్టీ ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ఎన్నికలు జరిగే ప్రతి మండలానికి ఒక ఏసీపీ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, వారి అధీనంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను కేటాయించారు. ఈ ఫోర్స్‌లో స్పెషల్ యాక్షన్ టీమ్ పోలీసులు పూర్తి స్థాయి రైట్ గేర్‌తో సిద్ధంగా ఉంటారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం భారతీయ నాగరిక్ సురక్ష సంహిత లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలను విధిస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల వరకు ప్రచారం, పార్టీ చిహ్నాలు, గుంపుల గుమికూడింపులు పూర్తిగా నిషేధం. పోలింగ్ స్టేషన్‌లో మొబైల్ ఫోన్లు మరియు ప్రచార సామగ్రి అనుమతించబడవని పేర్కొన్నారు. మొదటి విడత ఎన్నికల బందోబస్తు కోసం దాదాపు 782 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నట్లు సీపీ తెలిపారు. ఇందులో 6గురు ఏసీపీలు, 19 ఇన్స్పెక్టర్లు, 40 ఎస్సైలు, 34 హెడ్ కానిస్టేబుల్స్, 392 కానిస్టేబుళ్లు, 47 స్పెషల్ యాక్షన్ టీమ్ పోలీసులు, 144 హోంగార్డ్స్ మరియు 100 మంది బెటాలియన్ స్పెషల్ పోలీసులు ఉన్నారు. ఎన్నికల అనంతరం అదేరోజు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేధం అని సీపీ స్పష్టం చేశారు.సీపీ గౌస్ ఆలం ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసేందుకు ప్రజలు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసు అధికారులకు పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉక్రెయిన్‌లో మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. అయితే యుద్ధ పరిస్థితుల్లో దేశంలో ఎన్నికలు నిర్వహించాలంటే మిత్రదేశాల నుంచి భద్రత, సహకారం అవసరం. మరోవైపు ప్రతిపక్షం కూడా ప్రస్తుతం ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని అభిప్రాయపడుతోంది.
- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ



కాంగ్రెస్ హయాంలోనే మూడు సార్లు 'ఓట్‌చోరీ'

- మండిపడ్డ కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 10: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై జరుగుతున్న చర్చలో కాంగ్రెస్ గందరగోళం సృష్టించడాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తప్పుపట్టారు. ఎస్ఐఆర్‌పై లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ, విపక్షాలు గత నాలుగు నెలలుగా 'ఓట్ చోరీ'పై మాట్లాడుతున్నాయని, అయితే దేశంలో నిజంగా ఎప్పుడు, ఎలా ఓట్ చోరీ జరిగిందో తాను చెప్పాలనుకుంటున్నానని అన్నారు. ఒక వ్యక్తికి ఓటరుగా నమోదు చేసుకునే అర్హత లేనప్పటికీ అతను ఓటరుగా నమోదు చేసుకుంటే అది ఓట్ చోరీ అవుతుందని, అనుచిత విధానాలతో ఎన్నికల్లో గెలిస్తే దానిని ఓట్ చోరీ అంటామని, ప్రజాతీర్పుకు భిన్నంగా ఒక వ్యక్తి అధికారాన్ని హస్తగతం చేసుకుంటే అది కూడా ఓట్ చోరీ అవుతుందని అమిత్‌షా చెప్పారు. స్వతంత్ర భారతదేశంలో కాంగ్రెస్ హయాంలోనే మూడు సార్లు 'ఓట్ చోరీ' ఘటనలు చోటుచేసుకున్నాయని అమిత్‌షా విమర్శించారు. జవహర్ లాల్ ప్రధానిగా ఉన్నప్పుడు 1952లో తొలిసారి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ జరిగిందని చెప్పారు. దేశ తొలి ప్రధానిని నిర్ణయించే సమయంలో మొదటిసారి ఓట్ చోరీ జరిగిందని, మెజారిటీ పీసీసీలు సర్దార్ పటేల్‌ను ఎన్నుకున్నాయని, మొత్తం ఓట్లలో 28 ఓట్లు పటేల్‌కు పడితే, నెహ్రూకు కేవలం రెండో ఓట్లు వచ్చాయని చెప్పారు. అయినప్పటికీ నెహ్రూ ప్రధాని అయ్యారని అన్నారు. రెండో ఘటన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో జరిగిందని చెప్పారు. ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని కోర్టు చెప్పినప్పటికీ ఆమె తనకు తాను లీగల్ ఇమ్యూనిటీ కల్పించుకున్నారని అన్నారు. మూడో ఘటనలో భారతీయ పౌరురాలు కాకముందే సోనియాగాంధీ ఓటరయ్యారని, ఇప్పుడు ఆ అంశం న్యాయస్థానంలో ఉందని అమిత్‌షా పేర్కొన్నారు. ఇది ఓట్ చోరీకి మరో ఉదాహరణ అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ వరుస ఎన్నికల్లో ఓటమిపాలవ్వడంతో ఇక తప్పుడు మార్గాల్లో గెలవలేమని ఆందోళన చెందుతోందని అమిత్‌షా విమర్శించారు. ఎన్నికల్లో ఓటమికి కాంగ్రెస్ నాయకత్వమే కారణమని, ఈవీఎంలు, ఓట్ చోరీ కాదని అన్నారు. అక్రమ చొరబాటుదారులను ఓటరు జాబితాలో ఉంచేందుకు విపక్షాలు ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నాయని తప్పుపట్టారు.

విశ్వ వీక్షణం

మీ దయ.. మాకేం అక్కర్లేదు

- నరేగా కొత్త నిబంధనల నోట్‌ను చింపేసిన మమతా బెనర్జీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కోల్‌కతా, డిసెంబర్ 10: ఉపాధి హామీ పథకం(నరేగా) కొత్త నిబంధనలను తెలియచేస్తూ కేంద్రం పంపిన నోట్‌ను పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ బుధవారం బహిరంగంగా చింపివేశారు. కూచ్ బిహార్‌లో ఓ ర్యాలీలో ఆమె ప్రసంగిస్తూ నరేగా కింద బెంగాల్‌కు విడుదల చేయాల్సిన నిధుల కోసం కేంద్రం పనికిమాలిన షరతులు పెడుతున్నదని ఆరోపించారు. 'డిసెంబర్ 6 నుంచి త్రైమాసిక లేబర్ బడ్జెట్‌ను సమర్పించాలని కోరుతూ మొన్న మాకు కేంద్రం నుంచి ఓ లేఖ అందింది. కేంద్రం మా చేతులు కట్టేయాలని చూస్తున్నది. ఈ షరతులు అమలు చేయడానికి సమయం ఎక్కడుంది? ఇప్పుడు డిసెంబర్‌లో ఉన్నాం. వచ్చే ఏడాది ప్రారంభంలోనే ఎన్నికలు ఉంటాయి. వ్యవసాయ కార్మికులకు శిక్షణ ఇవ్వాలని కేంద్రం చెబుతున్నది. వారికి ఎప్పుడు శిక్షణ ఇవ్వాలి, వారికి ఎప్పుడు ఉపాధి కల్పించాలి?' అని ఆమె ప్రశ్నించారు. ఇదో పనికిమాలిన కాగితమని(నరేగా నోట్) ఆమె విమర్శించారు. మీ దయాదాక్షిణ్యాలు మాకు అవసరం లేదు. ఇది మమ్మల్ని అవమానించడమే. అందుకే ఈ నోట్‌ను చింపివేస్తున్నాను అని మమత ప్రకటించారు.



'అబ్బబ్బబ్బ, ఈ పడిశం కాలం మహా పాడుకాలం. రెండు రోజుల నుంచి తల దిమ్ముగా ఉంది. నా పాలు తాగి ఈ చంటిదానికి కూడా జలుబు వచ్చింది' అని ప్రతి ఇంటిలో చిన్నపిల్లల తల్లులు ఇలా అనుకోవడం మామూలే. ఆపై చంటి పిల్లలకు కూడా రొంప మొదలైతే ఏం చేస్తారు పాపం!!.

సాధారణ దగ్గు, జలుబు

దీనికి కూడా యాంటీ బయోటిక్స్ వాడాలా?

డా. కౌశల్ గోవర్ధన
వైస్ చైర్మన్
శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
డా. ధనుంజయ నర్సింగ్ హోమ్
7702417779

మారుతున్న వాతావరణం కారణంగా ప్రజలు అనేక రకాల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. ముఖ్యంగా ఈ చలికాలంలో జలుబు, దగ్గు సమస్య అధికంగా ఉంటుంది. ఉదయం, రాత్రి చలి వాతావరణం.. మధ్యాహ్నం సమయంలో పొడి వాతావరణం కారణంగా.. కాలుష్యం పెరిగిపోతుంది. ఈ విచిత్ర వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రజలలో రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. ఫలితంగా దగ్గు, జలుబు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. సీజన్లు మారినప్పుడు సాధారణంగా చాలా మందికి దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ సమస్యలు వస్తుంటాయి. కొందరికి జలుబు ఉండకపోయినా విపరీతంగా దగ్గు వస్తుంది. ఇక జలుబు వచ్చిన వారికి అయితే అది తగ్గే క్రమంలో దగ్గు వస్తుంది. ఎలాగైనా సరే కచ్చితంగా దగ్గుతో ఇబ్బంది పడతారు. 'అబ్బబ్బబ్బ, ఈ పడిశం కాలం మహా పాడుకాలం. రెండు రోజుల నుంచి తల దిమ్ముగా ఉంది. నా పాలు తాగి ఈ చంటిదానికి కూడా జలుబు వచ్చింది' అని ప్రతి ఇంటిలో చిన్నపిల్లల తల్లులు ఇలా అనుకోవడం మామూలే. ఆపై చంటి పిల్లలకు కూడా రొంప మొదలైతే ఏం చేస్తారు పాపం!!.

సమస్య మూలమేమిటో తెలియాలి

చలికాలంలో దాదాపు ప్రతీ ఇంటి కథా ఇదే. చిన్నా పెద్దా, ఆడా మగా తేడా లేకుండా ఈ చలికాలంలో అందర్నీ పలకరించే చుట్టం జలుబు. అంత పెద్ద అనారోగ్యమూ కాదు, అలాగని బాధ పెట్టకుండా ఉండదు. ఇంటిలో ఒకరికి వస్తే, మిగతా అందరికీ అంటుకుంటుంది. పరిష్కారం తెలియాలంటే ముందు సమస్య మూలమేమిటో తెలియాలి. జలుబు ఒక రోగ లక్షణం మాత్రమే. అసలు సమస్య వైరల్ ఇన్ఫెక్షన్. ఫలానా అని చెప్పలేని వందల వైరస్‌లలో అదొకటి. సాధారణంగా రైనోవైరస్ అయి ఉంటుంది. ఇతర ఇన్ఫెక్టెడ్ వ్యక్తుల వల్ల గానీ, గాలిలోంచి గానీ, వైరస్ అంటుకున్న వస్తువుల నుంచిగానీ ఇది మన ముక్కు లేదా నోట్లోకి ప్రవేశిస్తుంది. అక్కడి చర్మపు పొరల్లో ఇంకా అభివృద్ధి చెంది చుట్టుపక్కల అవయవాల్ని ఈ వైరస్ ఇబ్బంది పాలు చేస్తుంది. రైనోవైరస్ ఇన్ఫెక్షన్ చాలా వరకు ముక్కు, గొంతు, తల భాగాలకు పరిమితమై, సాధారణ జలుబు, దగ్గు, తలనొప్పి కాస్త ఒళ్లు నొప్పులకు పరిమితం అవుతుంది. మరీ చిన్న పిల్లలలో మాత్రమే అరుదుగా న్యుమోనియా, బ్రోన్కియోలిటిస్ లాంటి సమస్యలు రావచ్చు.

అపోహలు

తాజాగా, వేడిగా, ఇంటిలో చేసిన ఆహారం తినడం మినహా వేరే పత్యాలు అవసరం లేదు. పాలూ పెరుగూ తినకూడదు, జలుబు చేసిన తల్లి బిడ్డకు పాలివ్వకూడదనుకోవడం కూడా అపోహలే. ఒక్కోసారి కొన్ని వైరస్‌ల ప్రభావం మామూలు కంటే కాస్త ఎక్కువగా తగులుతుంది. ఫ్లూ (ఇన్ ఫ్లూయెంజా వైరస్) ఆ కోవలోనిదే. ఫ్లూ అంటువ్యాధి. ఈ వైరస్ సోకిన రెండు మూడు రోజులలో విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, అలసట, తలనొప్పి వస్తాయి. ముక్కు పట్టేయడం, కళ్ళెర్ర బడటం, పొడి దగ్గు, అది కూడా ఛాతిలోంచి దగ్గినట్లయి ఛాతి నొప్పి కూడా రావచ్చు. పసిపిల్లల్లో, వృద్ధుల్లో, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఫ్లూ న్యూమోనియా వరకూ దారి తీస్తుంది. అరుదుగా ప్రాణాంతకం కూడా. పిల్లలలో 100 ఫారిన్ హీట్ పైన జ్వరం, పక్కటెముకలు ఎగరేయడం, వేగంగా ఊపిరి పీల్చడం, పాలు తాగక పోవడం, శరీరం నీలి రంగులోకి మారడం, మూలగడం వంటి లక్షణాలు ప్రమాద సూచికలు. అటువంటప్పుడు కషాయాలు, చుక్కల మందులూ అని ఇంట్లో కూర్చోకుండా పిల్లల్ని హాస్పిటల్ లో చేర్చాలి. ఆక్సిజన్, కొన్ని రకాల యాంటీ వైరల్ మందులతో ప్రాణాపాయం నుండి గట్టెక్కవచ్చు. పది నుండి పద్నాలుగు రోజుల్లో ఈ ఫ్లూ నుండి ఉపశమనం దొరుకుతుంది. అలసట, ఆకలి మందగించడం ఇటువంటి లక్షణాలు మరికొద్ది రోజులుండవచ్చు. సరైన పోషకాహారం ఈ సమయంలో ఎంతో అవసరం.
ఇన్‌ఫ్లూయెంజా/ ఫ్లూ టీకా కూడా ఇప్పుడు అందుబాటులో ఉంది. ఆరు నెలలు దాటిన తర్వాత నుంచి పిల్లలకు నెల నిడివితో రెండు డోసులు, ఆపైన ప్రతి సంవత్సరం తీసుకోవాలి.



జలుబు ఒక సాధారణ రోగ లక్షణం

ఇది సాధారణ జలుబు (Common cold) కాబట్టి, అందునా వైరల్ ఇన్ఫెక్షన్ కాబట్టి యాంటిబయోటిక్స్ వాడటం వల్ల ప్రయోజనం ఉండదు. మొదటి మూడు నాలుగు రోజులు ముక్కు వెంబడి నీళ్లు కారటం, ముక్కు పూడుకుపోవడం, వాసన తెలియక పోవడం, గొంతు పొడి బారడం, దగ్గు, జ్వరం వచ్చినట్లుండడం సహజం.తరచూ కొంచెం నీళ్లు తాగడం, రెండు పూటలా నోరు, ముక్కు, గొంతు శుభ్రపరుచుకోవడం (salt water gargling) వల్ల దగ్గు, ముక్కు కారడం నుండి ఉపశమనం ఉంటుంది. ఏదైనా బామ్ రాసుకోవడం, వేడినీళ్ల ఆవిరి పెట్టుకోవడం కూడా ప్రయోజనకరమే. ఒళ్లు నొప్పులు, శరీరం వెచ్చబడటం, తలనొప్పి లాంటి బాధలకు వారి బరువుకు తగినంత పారాసిటమాల్ టాబ్లెట్ వేసుకోవచ్చు. గర్భిణులైనా, బాలింతలైనా సరే నిర్భయంగా ఈ మాత్ర వేసుకోవచ్చు. అవసరమైనప్పుడు కొన్ని యాంటీబయోటిక్స్ మీ వ్యక్తిగత వైద్యుని సలహా మేరకు వాడొచ్చు.

మీరు ఎప్పుడూ వైద్యుని సంప్రదించాలి

కొన్ని సార్లు ఈ సాధారణ జలుబు ఉన్న స్థితిలో, కొన్ని బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు వచ్చి చేరతాయి. దీన్ని మనం ఎలా గుర్తించాలంటే, ఉన్నట్లుండి జ్వర తీవ్రత పెరగడం, ముక్కు నుంచి స్రావాలు చిక్కగా, పసుపుపచ్చగా మారడం, గొంతులో కళ్లె పేరుకుపోవడం లాంటివి కనిపిస్తాయి. ఇలాంటప్పుడు రోగ లక్షణాన్ని బట్టి రుగ్మతకు మందులు అవసరమౌతాయి. తక్షణం వైద్యుని దగ్గరికి వెళ్లండి. పిల్లల కోసమైతే పిల్లల వైద్యుని సంప్రదించండి. ఎందుకంటే మీకు / మీ పిల్లలకు అసలు యాంటీబయోటిక్స్ అవసరం ఉందా, ఉంటే ఏ రకం, ఎంత మోతాదు, ఎంతకాలం వాడాలో వారే సరిగ్గా చెప్పగలరు. OTC (Over the counter)/ మందుల షాపు నుండి తోచిన యాంటీబయాటిక్ కొనుక్కొచ్చి వాడటం మనకే కాదు, సమస్త మానవాళికే ప్రమాదం సుమా! ఇకపోతే ఈ రైనోవైరస్ వంటి వాటివల్ల వచ్చే సాధారణ జలుబు వారం పది రోజులలో (వంటింటి చిట్కాలు అయినా, అసలేమీ చేయకపోయినా) తగ్గిపోతుంది. మరీ చంటి పిల్లలైతే జ్వరం, ముక్కు దిబ్బడ తగ్గటానికి పిల్లల వైద్యుని సంప్రదించి మందులు వాడాలి.

తగిన జాగ్రత్తలు, చేయకూడని పనులు

జలుబు వల్ల ఒక్కోసారి చెవులోంచి చీము కారవచ్చు కూడా. దీనికి సత్వర చికిత్స అవసరం. తరచూ జలుబు చేసి చెవులదాకా పాకే పిల్లలలో దీర్ఘకాలంలో వినికిడి సమస్యలు రావచ్చు. ముక్కు బ్లాక్ అయితే, జాగ్రత్తగా ఒకటి రెండు సెలైన్ చుక్కలు ముక్కులలోకి జారవిడవాలి. సెలైన్ నీటితో నెబ్యులైజేషన్ ఇచ్చినా మంచిదే. ముఖ్యంగా ముక్కులో నూనె చుక్కలు వేయడం ప్రమాదకరం. పిల్లలకు వేడినీటి ఆవిరి పట్టడం ఎంతమాత్రమూ మంచిదికాదు. సున్నితమైన ముక్కు లోపలి పొరలు దెబ్బ తినడమేకాకుండా వేడినీరు ఒలికి ఒళ్లు కాలే ప్రమాదం కూడా ఉంటుంది. నెబ్యులైజేషన్ కోసం ఆస్థమా రోగులు వాడే మందుల్ని ఇచ్చేస్తుంటారు కొందరు. మరికొందరైతే ఇంట్లోనే నెబ్యులైజర్ ఉందని గర్వంగా చెప్పుకుంటారు. అవసరం లేకున్నా నెబ్యులైజర్ పెడుతూ ఉంటారు. ఇదికూడా సమర్థనీయం కాదు. ఉపశమనం లేకపోగా అనర్థాలే ఎక్కువ. మార్కెట్ లో దొరికే వందల రకాల దగ్గుమందులతో సైతం ఫలితం ఉండదు, వాటితో సైడ్ ఎఫెక్ట్స్ ఎక్కువ. మంచి తేనె అయితే పిల్లల దగ్గుకు కాస్త తెరపినిస్తుంది. **గమనిక: అదికూడా ఆరు నెలలలోపు పిల్లలకు నిషిద్ధం. నాలుగైదు రోజుల తర్వాత కొంతమంది పిల్లల్లో కడుపునొప్పి, విరేచనాలు ఉంటాయి. ఇదికూడా వైరస్ ప్రభావమే.**

సౌదీ అరేబియాను కుదిపేసిన వరదలు

జెడ్డా, డిసెంబర్ 10: సౌదీ అరేబియా అనగానే మక్కా, మదీనా, ఎడారి చిత్రాలే కళ్ల ముందు కదలాడుతాయి. కానీ, ప్రస్తుతం అక్కడ వాతావరణ పరిస్థితులు మారుతున్నాయి. భారీ వర్షాల కారణంగా వరదలు పోటెత్తుతున్నాయి. తాజాగా ఎడారి దేశాన్ని వరదలు ముంచెత్తాయి. సౌదీలోని మదీనా, జెడ్డా , మక్కా తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షానికి ఆకస్మిక వరదలు సంభవించాయి. దీంతో జనజీవనం స్తంభించింది. జెడ్డాలో కురిసిన కుంభవృష్టికి నగరం మొత్తం అతలాకుతలమైంది. కుండపోత వర్షాల తర్వాత నగరాన్ని వరదలు ముంచెత్తాయి. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ట్రాఫిక్ స్తంభించడంతో ప్రజా రవాణా నిలిచిపోయింది. దీంతో అధికారులు నగరంలో రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు సౌదీ మీడియా నివేదించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో బయటకు రావొద్దని.. ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని సూచించారు.

కర్ణాటకలో 2.8 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు

- అసెంబ్లీలో సీఎం సిద్ధరామయ్య వెల్లడి

బెలగావి: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో 2.84 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం అసెంబ్లీలో వెల్లడించారు. బీజాపూర్ సిటీ ఎమ్మెల్యే బసన్నగౌడ్ పాటిల్ యత్నాల్ అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వక సమాధానం ఇస్తూ అత్యధికంగా పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖలో 79,694 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఒక పక్క రాష్ట్రంలోని నిరుద్యోగులకు గరిష్ఠ వయసు పరిమితి దగ్గరపడుతున్నదని, మరో పక్క ఉద్యోగ నియామక సంస్థ కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ అవినీతి కారణంగా అర్హులైన అభ్యర్థుల భవిష్యత్ తీవ్ర ప్రమాదంలో పడిందని యత్నాల్ ట్వీట్ చేశారు.



దీపావళికి యునెస్కో గుర్తింపు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 10: దీపావళిని యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేర్చడాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ పండగకు ఈ హోదా దక్కడంపై భారత దేశ ప్రజలతోపాటు ప్రపంచవ్యాప్తంగా ప్రజలంతా సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారన్నారు. ఈ పండగ.. ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి పొందిందని ఆయన పేర్కొన్నారు. దీపావళికి ఈ హోదా దక్కడంపై బుధవారం తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రధాని మోదీ స్పందించారు. ఈ పండగ.. మన సంస్కృతి, నైతికతలకు చాలా దగ్గరి సంబంధం కలిగి ఉంటుందని చెప్పారు. ఇది మన నాగరికతకు ఆత్మ వంటిదని ఆయన అభివర్ణించారు. ఈ పండగ ధర్మాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. యునెస్కో జాబితాలో చేరడం వల్ల ఈ పండగ మరింత ప్రజాదరణ పొందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. శ్రీరాముడి ఆదర్శాలు మనకు శాశ్వతంగా మార్గనిర్దేశనం చేస్తుంటాయని ఈ సందర్భంగా ప్రధాని మోదీ వివరించారు.

హాకీ జూనియర్ వరల్డ్ కప్...
భారత్‌కు కాంస్యం

ప్రతిష్టాత్మక హాకీ జూనియర్ ప్రపంచకప్‌లో భారత్‌కు కాంస్యం దక్కింది. బుధవారం ఆఖరి వరకు అర్జెంటీనాతో హోరాహోరీగా సాగిన పోరులో భారత్ 42తో అద్భుత విజయం సాధించింది. చివరిసారి 2016(లక్నో)లో టైటిల్ గెలిచిన భారత యువ జట్టు ఆ తర్వాత పోడియం ఫినిష్ చేయలేకపోయింది. 2021 (భువనేశ్వర్)తో పాటు, 2023 (కౌలాలంపూర్)లో నాలుగో స్థానంలో నిలిచి నిరాశపరిచింది. చివరి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన కాంస్య పోరులో టీమ్‌ఇండియా తరఫున అంకిత్‌పాల్ (49ని), మన్మీత్‌సింగ్ (52ని), శారదానంద్ తివారీ(57ని), అన్మోల్ ఎక్కా(58ని) గోల్స్ చేయగా,నికోలస్ రోడ్రిగెజ్ (3ని), సాంటియాగో ఫెర్నాండెజ్ (44ని) అర్జెంటీనాకు గోల్స్ అందించారు. మ్యాచ్ విషయానికొస్తే తొలి రెండు క్వార్టర్లు భారత్‌పై అర్జెంటీనా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మ్యాచ్ మొదలైన మూడో నిమిషానికే అన్మోల్ ఎక్కా చేసిన తప్పిదంతో దక్కిన పెనాల్టీ స్ట్రోక్ అవకాశాన్ని రోడ్రిగెజ్ గోల్ చేయడంతో అర్జెంటీనా 10 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. భారత్ గోల్‌పోస్ట్ లక్ష్యంగా అర్జెంటీనా దాడులు చేయడంతో మ్యాచ్ రసవత్తరంగా సాగింది. 20వ నిమిషంలో దిల్‌రాజ్‌సింగ్ చేసిన గోల్ ప్రయత్నాన్ని అర్జెంటీనా గోల్‌కీపర్ జ్యాకిన్ రుయిజ్ అడ్డుకోవడంతో అది సాధ్యపడలేదు. అయితే మూడో క్వార్టర్ నుంచి టీమ్‌ఇండియా మ్యాచ్‌పై పట్టు సాధించేందుకు ప్రయత్నించింది. 31వ నిమిషంలో వరుసగా వచ్చిన నాలుగు పెనాల్టీ కార్నర్ అవకాశాలను భారత్ గోల్స్‌గా మలువలేకపోయింది. మరో ఎండ్‌లో 37వ నిమిషంలో తమకు దక్కిన పెనాల్టీ కార్నర్‌ను గోల్ చేసిన అర్జెంటీనా ఆధిక్యాన్ని 20కు పెంచుకుంది. ఆఖరిదైన నాలుగో క్వార్టర్‌లో అన్మోల్ ఫ్లిక్‌ను అంకిత్‌పాల్ గోల్ చేయడంతో భారత్ ఖాతా తెరిచింది. నాలుగు నిమిషాల తేడాతో మన్మీత్‌సింగ్ కొట్టిన పెనాల్టీతో స్కోరు 22తో సమమైంది. అయితే అదే దూకుడు కొనసాగిస్తూ ఆఖర్లో శారదానంద్, అన్మోల్ వరుస గోల్స్ కొట్టడంతో భారత్‌కు చిరస్మరణీయ విజయం సాధించింది.



టాప్ 2... ఆ ఇద్దరే
వన్డే ర్యాంకులు ప్రకటించిన ఐసీసీ

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా సీనియర్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆధిపత్యం కొనసాగించారు. ఐసీసీ బుధవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లీ రెండో స్థానానికి చేరుకున్నారు. ఇప్పటికే నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా కొనసాగుతున్న రోహిత్ శర్మ.. తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో విరాట్ కోహ్లీ అద్భుతంగా బ్యాటింగ్ చేసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. దాంతో రన్ మిషన్ ర్యాంకు గణనీయంగా మెరుగుపడింది. ప్రస్తుతం నెంబర్ వన్ ప్లేస్‌ను చేరుకునేందుకు విరాట్ కోహ్లీ.. అగ్రస్థానానికి చేరుకునేందుకు కేవలం ఎనిమిది రేటింగ్ పాయింట్ల దూరంలో ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు మ్యాచుల్లో 302 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ ఉన్నది. సిరీస్‌లోని చివరి వన్డేలో కోహ్లీ అజేయంగా 65 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దాంతో ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో రెండుస్థానాలు మెరుగుపరుచుకొని రెండో ప్లేస్‌కు చేరుకున్నాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వన్డేల్లో స్థిరంగా రాణిస్తూ తన నెంబర్ వన్ ప్లేస్‌ను నిలబెట్టుకున్నాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో 146 పరుగులు చేశాడు. కోహ్లీ, రోహిత్ ఇద్దరు ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్ 2 ప్లేసుల్లో నిలిచారు. టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐదో స్థానంలో ఉన్నాడు. మరో బ్యాట్స్‌మెన్ శ్రేయాస్ అయ్యర్ ఒక ర్యాంకు దిగజారి 10వ స్థానానికి చేరుకున్నాడు. కేఎల్ రాహుల్ రెండు స్థానాలను మెరుగుపరుచుకొని 12వ ప్లేస్‌కు చేరాడు. ఇక బౌలింగ్ ర్యాంకుల్లో కుల్దీప్ యాదవ్ మూడు ర్యాంకులు మెరుగుపరుచుకొని మూడోస్థానంలో నిలిచాడు.

కోచ్‌పై.. ప్లేయర్ల దాడి

పుదుచ్చరిలో అండర్ 19 క్రికెట్ కోచ్ ఎస్ వెంకటరమణపై ప్లేయర్లు దాడి చేశారు. క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ పాండిచ్చరికి హెడ్ కోచ్‌గా చేస్తున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ కోసం తమను జట్టుకు ఎంపిక చేయలేదని ముగ్గురు క్రికెటర్లు కోచ్‌పై దాడి చేశారు. కోచ్ తలకు, భుజానికి గాయాలయ్యాయి. తలకు 20 కుట్లు వేశారు. సీదార్‌పేట్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రస్తుతం కోచ్ వెంకటరమణ ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. దాడి చేసిన క్రికెటర్లు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకుంటామని పోలీసులు చెప్పారు. ఈ కేసుకు చెందిన వివరాలను త్వరలో వెల్లడిస్తామని సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ రాజేశ్ తెలిపారు. భారతీదశన్ పాండిచ్చరి క్రికెటర్స్ ఫోరమ్ కార్యదర్శి జీ చంద్రన్ ప్లేయర్లను రెచ్చగొట్టినట్లు కోచ్ తన ఫిర్యాదులో తెలిపాడు. డిసెంబర్ 8వ తేదీన సీఏపీ కాంప్లెక్స్‌లో ఇండోర్ నెట్స్ వద్ద ఉన్న సమయంలో సీనియర్ క్రికెటర్లు కార్తికేయన్, అరవిందరాజ్, సంతోష్ కుమారన్ తన వద్దకు వచ్చారని, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీకి ఎంపిక చేయకపోవడానికి తానే కారణమని చెబుతూ అటాక్ చేశారన్నారు.



పాస్‌లు, టికెట్లు లేకుంటే అనుమతించరు

- మెస్సీ మ్యాచ్‌కు కట్టుదిట్టమైన భద్రత

ఉప్పల్ స్టేడియంలో శనివారం జరిగే అర్జెంటీనా సాకర్ దిగ్గజం లియోనల్ మెస్సీ.. ఎగ్జిబిషన్ మ్యాచ్ కోసం రాచకొండ పోలీసులు పలు కీలక సూచనలు చేశారు. మెస్సీని చూసేందుకు టికెట్లు, పాస్‌లు ఉంటేనే స్టేడియానికి రావాలని, లేని వారికి ప్రవేశం లేదని పోలీసులు స్పష్టం చేశారు. టికెట్లు, పాస్‌లు లేకుండా స్టేడియానికి వచ్చి ఇబ్బంది పడవద్దని ఫుట్‌బాల్ అభిమానులకు సూచించారు. మెస్సీ సాకర్ మ్యాచ్ సందర్భంగా స్టేడియం పరిసర ప్రాంతాల్లో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రద్దీ ఏర్పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అండర్ 19 హైదరాబాద్ కెప్టెన్‌గా శ్రీవల్లి

లక్నో వేదికగా ఈనెల 13 నుంచి మొదలయ్యే బీసీసీఐ మహిళల అండర్ 19 వన్డే ట్రోఫీ కోసం మంగళవారం హైదరాబాద్ జట్టును ఎంపిక చేశారు. మొత్తం 15 మందితో ప్రకటించిన జట్టులో కరీంనగర్‌కు చెందిన యువ క్రికెటర్ కట్టా శ్రీవల్లి వైస్‌కెప్టెన్‌గా ఎంపికైంది. కెప్టెన్‌గా నిధి వ్యవహరించనుండగా, జిల్లాల నుంచి శ్రీవల్లితో పాటు అక్షయరెడ్డి హైదరాబాద్ టీమ్‌లో చోటు దక్కించుకుంది. జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కట్టా లక్ష్మారెడ్డి, ఉమారాణి దంపతుల చిన్నకూతురు అయిన శ్రీవల్లి జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్నది. కూతురు ఆసక్తి గమనించిన తల్లిదండ్రులు చిన్నతనం నుంచి క్రికెట్‌లో ప్రత్యేక శిక్షణ అందించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తూ తాజాగా హైదరాబాద్ టీమ్‌కు ఎంపికైంది.

విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో
ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47

తెలుగు చిత్ర పరిశ్రమలో తమదైన ముద్ర వేసిన విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కలయికలో రానున్న చిత్రం కోసం సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. కుటుంబ కథా చిత్రాల కథానాయకుడిగా వెంకటేష్‌కి ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాగే, చక్కిలిగింతలు పెట్టే హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల మేళవింపుతో కుటుంబ బంధాలను, విలువలను తెలియజేసే చిత్రాలను తెరకెక్కించడంలో త్రివిక్రమ్ దిట్ట. అందుకే వీరి కలయిక, ప్రకటనతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. వెంకటేష్ సినీ ప్రయాణంలో 77వ చిత్రంగా రూపొందుతోన్న ఈ సినిమాకి "ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47" అనే ఆసక్తికర టైటిల్ ను ఖరారు చేశారు. టైటిల్‌లోగోని గమనిస్తే.. వినోదభరితమైన ఈ కుటుంబ కథా చిత్రంలో ఉత్కంఠ రేకెత్తించే అంశాలు కూడా ఉంటాయని అర్థమవుతోంది. "ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47" ఫస్ట్ లుక్ ఆకట్టుకుంటోంది. వెంకటేష్ ఫ్యామిలీ మ్యాన్ లుక్‌లో క్లాస్ గా కనిపిస్తున్నారు. హృదయాన్ని తాకే భావోద్వేగాలతో నిండిన ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం రాబోతోందనే సంకేతాన్ని ఫస్ట్ లుక్ ఇస్తోంది. ఈరోజు హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో చిత్రీకరణ మొదలైంది. వెంకటేష్‌త్రివిక్రమ్ కలయిక మరోసారి ప్రేక్షకులందరికీ చిరస్మరణీయమైన అనుభూతిని అందించడానికి సిద్ధమవుతోంది.వెంకటేష్‌త్రివిక్రమ్ కలయికలో చిత్ర ప్రకటన వచ్చినప్పటి నుంచి చిత్ర పరిశ్రమతో పాటు, సాధారణ ప్రేక్షకుల్లోనూ ఈ చిత్రంపై ఆసక్తి నెలకొంది. పైగా త్రివిక్రమ్ శైలి భావోద్వేగాలు, హాస్యం, కుటుంబ విలువలను మేళవిస్తూ తెరకెక్కించే చిత్రంలో వెంకటేష్ నటిస్తుండటం ప్రేక్షకుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచింది. వెంకటేష్ తో కలిసి, ప్రేక్షకుల హృదయాలలో ఎప్పటికీ నిలిచిపోయే ఒక మంచి కుటుంబ కథా చిత్రాన్ని త్రివిక్రమ్ అందిస్తారనే అంచనాలు ఉన్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ హారిక & హాసిని క్రియేషన్స్ పతకంపై ఎస్. రాధాకృష్ణ(చినబాబు) ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 వేసవిలో భారీగా విడుదలకు సిద్ధమవుతోంది. వెంకటేష్, త్రివిక్రమ్ కలయిక కావడంతో ఇప్పటికే అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పుడు టైటిల్, ఫస్ట్ లుక్ విడుదలతో అంచనాలు రెట్టింపు అయ్యాయి. ప్రేక్షకులు, అభిమానులు ఈ అద్భుత కలయిక తెరపై ఏ మాయ చేస్తుందోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా.. హాస్యం, భావోద్వేగాల మేళవింపుతో వెండితెరపై వినోదాల విందుని అందించడానికి సిద్ధమవుతున్నారు.

కర్మస్థలం..'దివి' ఫస్ట్ లుక్

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ దివి వైద్య . మెగాస్టార్ చిరంజీవి నటించిన గాడ్‌ఫాదర్‌తోపాలు పలు తెలుగు చిత్రాల్లో నటించిన ఈ ముద్దుగుమ్మ బిగ్ బాస్‌లో కూడా మెరిసింది. ఇప్పటిదాకా గ్లామర్ టచ్ ఇచ్చిన దివి ఈ సారి అగ్రెసివ్ లుక్‌లో కనిపిస్తూ ఔరా అనిపిస్తోంది. దివి లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం కర్మ స్థలం. రాకీ షర్మన్ డైరెక్ట్ చేస్తున్నాడు. దివి యోధురాలిగా కదనరంగంలోకి దిగి పోరాడుతున్న అగ్రెసివ్ లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. బ్యాక్ గ్రౌండ్‌లో అగ్నికీలలు మధ్య సైన్యాన్ని చూడొచ్చు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో విడుదల కానున్న ఈ మూవీలో బాలీవుడ్ నటుడు చుంకీ పాండే, అరవింద్ కృష్ణ, అర్చనా శాస్త్రి కాలకేయ ప్రభాకర్, బలగం సంజయ్, మిథాలి చౌహాన్‌తోపాటు పలువురు నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సామ్రాద్ని ఫిల్మ్స్, రాయ్ ఫిల్మ్స్ బ్యానర్లపై హర్షవర్ధన్ షిండే నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి కార్తీక్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. పాన్ ఇండియా మార్కెట్‌ను టార్గెట్‌గా చేసుకుని హై స్టాండర్డ్ విజువల్స్‌తో సినిమాను రూపొందిస్తున్నట్టు ఫస్ట్ లుక్‌తో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్ రాకీ షర్మన్.

కోట్లు తెచ్చిపెడుతున్న 'కళంకావల్'

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన తాజా చిత్రం 'కళంకావల్' కేరళ బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తుంది. ఈ సినిమాకు జితిన్ జోస్ దర్శకత్వం వహించగా.. మమ్ముట్టి ఇందులో ప్రతినాయకుడి పాత్రలో నటించగా.. జైలర్ ఫేం వినాయకన్ కథానాయకుడిగా నటించాడు. డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం కేవలం నాలుగు రోజుల్లోనే రూ.50 కోట్లకు పైగా వసూళ్లను సాధించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో మమ్ముట్టి సైకో పాత్రలో కనిపించగా.. మమ్ముక్క నటన హైలైట్ అని ప్రేక్షకులు కామెంట్లు పెడుతున్నారు. ఈ వీకెండ్ పెద్ద సినిమాలేవి బాక్సాఫీస్ వద్ద లేకపోవడంతో ఈ చిత్రం మంచి కలెక్షన్లు రాబడుతుందని సమాచారం.

మెస్మరైజింగ్ శ్రీలీల

యంగ్ సెన్సేషనల్ బ్యూటీ శ్రీలీల వణికించే చలిలో కూడా తన అందంతో.. లేత సోయగాలతో చెమటలు పట్టిస్తోంది.. శ్రీలీలకు సంబంధించిన తాజా ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో చాలామంది నెటిజన్లు హాట్ కామెంట్స్ పెడుతున్నారు. తాజాగా శ్రీలీల తన సోషల్ మీడియా ఖాతాలో కొన్ని ఫోటోలకు విభిన్నమైన ఫోజులిచ్చింది. శ్రీలీల హాట్ ఫోజులకు చాలా మంది నెటిజన్లు ఫైర్ ఏమోజీస్ ని షేర్ చేస్తున్నారు. ఆ ఫోటోలలో శ్రీలీల అందం తళుక్కున మెరుస్తోంది. క్యూట్ స్మైల్ తో.. కట్టిపడేసే అందంతో శ్రీలీల తన అభిమానులను మెస్మరైజ్ చేస్తోంది. తాజా ఫోటోలలో శ్రీలీల అందం చూసిన చాలామంది నెటిజెన్లు వణికే చలిలో కూడా చెమటలు పట్టిస్తున్నావ్.. మరీ ఇంత అందాన్ని తట్టుకోలేకపోతున్నాం.. శీతాకాలంలో కూడా చెమటలు పడుతున్నాయి అంటే అది శ్రీలీల అందం మహిమే అంటూ వైరల్ కామెంట్స్ పెడుతున్నారు.. అలా శ్రీలీల ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో స్టైలిష్ డ్రెస్సులు వేసుకుంటూ ట్రెండీ ఫోజులిస్తూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా నిలుస్తోంది. అలా తాజా ఫోటోలు శ్రీలీల అభిమానులను అలరిస్తున్నాయి. ఈ ఫోటోలకు "నా అట్లాస్ ఈ రాత్రికి డల్లాస్ ని ఎంచుకుంది" అంటూ క్యాప్షన్ కూడా జోడించింది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200